
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య


జిల్లా వార్తలు

5

ఆదివారం 11 ఆగస్టు 2024



కొలిమిట్ల వరకు నిర్మించిన పైపులైన్



రోళ్లమడుగులో నిర్మించిన సంపు

దాహార్తి తీరేనా..!

- కలగా.. రోళ్లమడుగు నీటి పథకం
- టీడీపీ హయాంలో ప్రారంభించారని.. పక్కన పెట్టేశారు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో
- పల్లె ప్రజల ఎదురుచూపులు

సుండుపల్లె, ఆగస్టు 10: ఆడబిడ్డలు తాగునీటి కోసం పంపుసెట్లు, వ్యవసాయ బోర్లు, హ్యాండ్ పంపుల వద్దకెళ్లి నీళ్లు తెచ్చుకునే దుస్థితి లేకుండా చేసేందుకు... ప్రతి గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేసి.. ప్రజల దాహార్తి తీర్చేందుకు 2017 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రోళ్లమడుగు నీటి పథకాన్ని ప్రారంభించారు. ఆ పథకం పనులు పూర్తి అయితే.. మండల వ్యాప్తంగా తాగునీటి సమస్య తీరుతుందని.. ఆ దిశగా రోళ్లమడుగు నుంచి పైపులైన్ ఏర్పాటు చేశారు. తాగునీటి ట్యాంకులు నిర్మించి... సుమారు 50శాతం పనులను పూర్తి చేశారు. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో.. అప్పటి ఎమ్మెల్యే టీడీపీని వీడి వైసీపీలోకి వెళ్లడంతో ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి. తదనంతరం 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలవడం సుండుపల్లె మండల ప్రజలకు శాపంగా మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రోళ్లడుగు నీటి పథకం పనులను ఆపేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని ప్రారంభించారనే ఉద్దేశ్యంతో పక్కన పెట్టేసినట్లు సమాచారం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆగిపోయిన నీటి పథకం పనులను మళ్లీ ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసి తాగునీటిని అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రూ.50 కోట్లతో పనులు ప్రారంభం

మండలంలోని చిన్నగొల్లపల్లి, జి.రెడ్డివారిపల్లె, సొంతంవారిపల్లె గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో ప్రతి ఊరిలో ప్రతి ఇంటి ముందు తాగునీటి కుళాయి ద్వారా నీటిని అందించాలన్నదే లక్ష్యం. ఆ లక్ష్యం నెరవేర్చేందుకు ఏడేళ్ల కిందట టీడీపీ ప్రభుత్వంలో వెనుకబడిన ప్రాంతాలకు కేటా యించిన అభివృద్ధి నిధులనుంచి రూ.50 కోట్లతో రోళ్లమడుగు నీటి పథకం మంజూరైంది. 2018 నాటికి పూర్తి కావాలన్నది లక్ష్యమైనా పనులు పూర్తి కాలేదు. కొన్ని పనులు పూర్తి కాగా వాటికి రూ.16 కోట్ల చెల్లింపులు జరిగాయి. ఆ తర్వాత గడువు దాటిపోవడంతో నిధులు నిలిచిపోయాయి. రోళ్లమడుగు పథకం ప్రారంభంలో 163 పల్లెలకు తాగునీరు అందించడమే లక్ష్యం కాగా... జీఎస్టీ రావడం, నూతన ధరల కారణంగా పనులు ప్రారంభమయ్యే సమయానికి లక్ష్యం 86 పల్లెలకు పరిమితమైంది. ఇప్పటి వరకు రోళ్లమడుగు సమీపంలో బాహుదానదిలో రెండు ఇన్ఫిల్ట్రేషన్ బావులు, ఒక కలెక్షన్ బావి నిర్మాణం, ఫుట్ బ్రిడ్జి నిర్మాణం మాత్రమే పూర్త య్యింది. విద్యుత్ సరఫరాకు అవసరమైన విద్యుత్ నియంత్రికలు ఏర్పాటు చేశారు. కొంత మేర ప్రధాన పైపులైన్ల నిర్మాణం పూర్తయ్యింది. పది ఉపరితల ట్యాంకుల నిర్మాణం ప్రారంభమై అర్ధాంతరంగా ఆగాయి. 1700 కిలోమీటర్ల పంప్ నిర్మాణంతో పాటు సానిపాయి సమీపంలో ఒక జీఎల్ఆర్ నిర్మాణం కావాల్సి ఉంది.

నిరుపయోగంగా ట్యాంకులు, పైపులైన్లు

నీటి పథకం పనుల్లో భాగంగా నిర్మించిన వాటర్ ట్యాంకులు, పైపులైన్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. రోళ్లమడుగు నుంచి పొలిమిట్ల వరకు పైపులైన్ పనులు పూర్తి అయ్యాయి. పనులు ఆగిపోవడంతో పైపులైను తుప్పుపట్టుతుంది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో కనీసం రూ.40కోట్లు వెచ్చించి ఉంటే సుండుపల్లె మండలంలో సుమారు 100 పల్లెలకు తాగునీటిని అందించే అవకాశం ఉండేది. అయితే టీడీపీ ప్రభుత్వంలో పనులు ప్రారంభించారని.. కక్ష సాధింపుతోనే పనులు నిలిపివేశారని.. ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. మండల వ్యాప్తంగా పలు ట్యాంకుల ట్యాంకుల నిర్మాణం దాదాపు పూర్తయ్యే దశలో ఉండగా.. పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.



నీటి పథకాన్ని ఐదేళ్లు ఆపడం దౌర్భాగ్యం..



తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో సుండుపల్లె మండలంలో మొదటి విడతగా 163 పల్లెలకు.. రెండవ విడతలో మండల వ్యాప్తంగా తాగునీటిని అందించాలన్న సంకల్పంతో రోళ్లమడుగు నీటి పథకానికి 2017 సంవత్సరంలో శంకుస్థాపన చేశారు. వైసీపీ అధికా రంలోకి వచ్చిన తర్వాత సుమారు ఐదు సంవత్సరాల కాలంలో కనీసం పనులు చేపట్టకపోవడం దౌర్భాగ్యం. నీటి పథకం పూర్తి అయితే మండలంలో తాగునీటి సమస్య అనేది ఉండదు.

- మహబూబ్‌బాషా, సుండుపల్లె

జీవిత కాలం తాగునీటి కష్టాలు..



తాగునీటి సమస్య అధికంగా ఉంది. జీవితకాలం తాగునీటి కష్టాలు తప్పడం లేదు. రోళ్లమడుగు నుంచి పైపులైన్ ఏర్పాటు చేసి.. ఇంటింటికి కుళాయి ద్వారా నీరు అందిస్తామని ఆరు సంవత్సరాలపైన అవుతోంది. ఇప్పుడైనా పనులు పూర్తి చేసి తాగునీరు అందించండి. బోరులో నాలుగు బిందెలు నీరు దొరికేది గగనంగా మారింది.

- అమ్మణమ్మ, జీ. రెడ్డివారిపల్లె

అనుమతి రాలేదు..

గత ప్రభుత్వంలో రోళ్లమడుగు నీటి పథకం పనులు పూర్తి చేయాలన్న సంకల్పంతో ప్రతిపాదనలు పంపించాము. ఐదేళ్ల ఎలాంటి అనుమతులు రాకపోవడంతో పనులు చేయలేకపోయాము. ప్రస్తుతం అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లాము. త్వరలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి.. పనులు పూర్తయ్యేలా చేస్తాము. తాగునీటి సమస్య ఉన్న చోట ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించాము. ఇంకా కొన్ని చోట్ల తాగునీటి సమస్య ఉంది. కొన్ని చోట్ల రైతు పొలాల నుంచి నీరు అందిస్తున్నాము.

- ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ

గండి క్షేత్రం జనసంద్రం



గండి క్షేత్రంలో పూజలందుకుంటున్న అంజన్న

చక్రాయపేట, ఆగస్టు 10: రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రం జనసంద్రం అయింది. మొదటి శ్రావణ శనివారం గండిలో ఎటుచూసినా భక్తజన సందోహం కనిపించింది. కనీవినీ ఎరుగని రీతిలో మొదటి వారంలో గండికి భక్తులు చేరుకున్నారు. దాదాపు 70వేల మంది దాకా ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. భక్తులు ఉదయంనుంచే ఆలయానికి బారులు తీరారు. వచ్చిన భక్తులకు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు కేసరి, ఉపప్రధాన అర్చకులు రాజా రమేశ్ మూలవిరాట్‌ను తోమాలలతో అలంకరించారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు క్యూలు కిక్కిరిసిపోయాయి. సర్వ దర్శనానికి దాదాపు 3గంటలు సమయం పట్టింది. అంతకుమించి రూ.100 దర్శనానికి బారులు తీరారు. రూ.50 దర్శనం చెప్పాల్సిన అవసరం లేదు. లడ్డు కౌంటర్ వద్ద తోపులాట జరిగింది. ఊహించని విధంగా భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో అధికారులు సైతం గాబరాపడ్డారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐ రంగనాథ్, చక్రాయపేట ఎస్ఐ వినోద్‌కుమార్‌లు చర్యలు తీసుకున్నారు. అలాగే ట్రాఫిక్ అంతరాయం తలెత్తడంతో పోలీసులు సరిదిద్దారు. కాగా.. శ్రావణమాసం సందర్భంగా గండిలో డాక్టర్ వాణి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని డీఎంహెచ్ఓ నాగరాజు పరిశీలించారు. ఇక్కడ భక్తులకు బీపీ చెకప్ తదితర పరీక్షలు నిర్వహించారు. రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు.



అంజదన్న దర్శనం కోసం వచ్చిన భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలు

జిల్లాలో భారీగా ఎస్ఐల బదిలీలు

రాయచోటిటౌన్, ఆగస్టు10: జిల్లాలో భారీగా ఎస్ఐలను బదిలీ చేస్తూ శనివారం కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. నరసింహారెడ్డి రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్, అబ్దుల్ జహీర్ రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్, కేబీ శివకుమార్ చిన్నమండెం, భక్తవత్సలం సంబేపల్లె, శ్రీనివాసులు టి.సుండుపల్లె, సుధాకర్ వీరబల్లి, రవీంద్రబాబు లక్కిరెడ్డిపల్లె, రామక్రిష్ణ గాలివీడు, వెంకటసుధాకర్‌రెడ్డి రామాపురం, రామాంజులు కలకడ, మధు రామచంద్రుడు గుర్రంకొండ, నరేంద్రకుమార్ కేవీపల్లె, చంద్రశేఖర్ వాయల్పాడు. శ్రీహరి వాయల్పాడు, బాలకృష్ణనాయుడు పీలేరు అర్బన్, మల్లికార్జునరెడ్డి పీలేరు అర్బన్, నవీన్‌బాబు రాజంపేట అర్బన్, మోహన్‌కుమార్ గౌడ్ పుల్లంపేట, రవిప్రకాశ్ పెనగలూరు, వెంకటేశ్వర్లు నందలూరు, లోకేశ్ రైల్వేకోడూరు, మహేశ్ ఓబులవారిపల్లె, వినోద్‌కుమార్ చిట్వేల్, అన్సర్‌బాషా మదనపల్లె వన్‌టౌన్, శ్రీనివాస్‌నాయక్ మదనపల్లె వన్‌టౌన్, రహీముల్లా మదనపల్లి టూటౌన్, కృష్ణమూరి మదనపల్లె టూటౌన్, హరిహరప్రసాద్ మదనపల్లె తాలూకా పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. అలాగే పీవీ రమణ మందనపల్లె తాలూకా, దిలీప్‌కుమార్ ముదివేడు, కృష్ణయ్య నిమ్మనపల్లి, రవికుమార్ రామసముద్రం, గాయత్రి మొలకలచెరువు, లోకేశ్‌రెడ్డి తంబళ్లపల్లి, శివశంకర పెద్దమండెం, ఎంకే నరసింహుడు పీటీయం, వెంకటేశ్వర్లు డీఎస్‌బీ అన్నమయ్య, శ్రీనివాసరెడ్డి డీఎస్‌బీ అన్నమయ్య, తిప్పేస్వామి డీఎస్‌బీ అన్నమయ్య, వెంకటశివకుమార్ డీఎస్‌బీ అన్నమయ్య, చంద్రమోహన్ డీసీఆర్‌బీ అన్నమయ్య, ఇనాయతుల్లా దిశ అన్నమయ్య, రమాదేవి దిశ అన్నమయ్య, వెంకటసుబ్బయ్య సీసీఎస్ అన్నమయ్య, రెడ్డెయ్య సీసీఎస్ అన్నమయ్య, మోహన్‌నాయక్ వీసీఆర్ అన్నమయ్య, వెంకటేశ్ వీసీఆర్ అన్నమయ్య, డేవిడ్‌రాజ్ వీసీఆర్ అన్నమయ్య, రమేశ్‌బాబు డీపీటీసీ అన్నమయ్య, విష్ణువర్ధన్ వీఆర్ అన్నమయ్య, వెంకటప్రసాద్ వీఆర్ అన్నమయ్య, రామక్రిష్ణారెడ్డి కర్నూలు రేంజ్ వీఆర్, నాగార్జునరెడ్డి కర్నూలు రేంజ్ వీఆర్, నాగేశ్వరరావు కర్నూలు రేంజ్ వీఆర్, డాక్టర్ నాయక్ కర్నూలు రేంజ్ వీఆర్, చంద్రశేఖర్ కర్నూలు రేంజ్ వీఆర్, చలపతి కర్నూలు రేంజ్ వీఆర్, చెన్నకేశవ కర్నూలు రేంజ్ వీఆర్‌లకు బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు ఇచ్చారు.

డిప్యూటీ తహశీల్దార్ల బదిలీలు

- 12 మంది ఇన్‌చార్జి తహసీల్దార్లుగా నియామకం

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 10: జిల్లాలో 20 మంది డిప్యూటీ తహశీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో 12 మందిని ఇన్‌చార్జి తహసీల్దార్లుగా నియమించారు.

డి.హరికుమార్	తంబళ్లపల్లి
జి.తపశ్విణి	కురబలకోట
కె.ప్రదీప్	మొలకలచెరువు
సయ్యద్‌అహ్మద్	పెద్దమండ్యం
ఎస్.పామిలేటి	వాల్మీకిపురం
ఎన్.కార్తీక్‌కుమార్	కేవీ పల్లి
ఎన్.రామాంజినేయులు	రామాపురం
పి.లక్ష్మీప్రసన్న	లక్కిరెడ్డిపల్లె
ఎస్.వెంకటేశ్వర్లు	సంబేపల్లె
కె.అరవింద్ కిషోర్	పుల్లంపేట
ఎస్.పీర్‌ముని	ఓబులవారిపల్లి
ఎ.పణికుమార్	కలకడకు బదిలీ చేశారు. అలాగే

పి.నరసింహకుమార్‌ను కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా, నవీన్‌ను కలికిరి డిప్యూటీ తహసీల్దార్‌గా, జి.రవికుమార్‌ను రాయచోటి డిప్యూటీ తహసీల్దార్‌గా, బి.రెడ్డెన్నను సుండుపల్లె డిప్యూటీ తహసీల్దార్‌గా, మిగిలిన వారిని కలెక్టర్ కార్యాలయంలో వివిధ సెక్షన్‌లలో నియమించారు.

పేదలకు రక్షణగా నిలవాల్సిన ఓ పోలీసు అధికారి అధికారాన్ని అడ్డుపెట్టుకుని.. వారి భూములను అప్పనంగా కాజేశాడు. పీకలలోతు కష్టాలలో ఉన్న రైతులకు డబ్బు ఆశ చూపించాడు. దీంతో కష్టాలలో ఉన్న రైతులు భూములను అమ్మి వచ్చిన డబ్బుతో తమ కష్టాలు తీర్చుకోవచ్చని ఆశపడ్డారు. ఇదే అదునుగా మధ్యవర్తుల ద్వారా కొనుగోలు చేసిన ఆ పోలీసు అధికారి.. పేదల భూములకు మొదట్లో కొంత డబ్బు ఇచ్చి.. ఆ భూములను ఆక్రమించుకున్నాడు.. మిగిలిన డబ్బులు చెల్లించకుండా వేధిస్తున్నాడు. ఎవరైనా ప్రశ్నిస్తే.. వారిపైనే దౌర్జన్యం చేస్తున్నాడు. ఇక ఆ భూమి తన పేరుతో ఉంటే ఇబ్బందులు ఎదురవుతాయమని ముందుగానే పసిగట్టిన ఆయన బినామీ పేరుతో పెట్టాడు.



పోలీస్ అధికారి భూ దందా

- డీకేటీ భూమిని లాక్కున్నాడు..
- డబ్బులు అడిగితే బెదిస్తున్నాడు..
- బాధిత రైతుల ఆవేదన

కురబలకోట, ఆగస్టు 10: తంబళ్ళపల్లె నియోజకవర్గం కురబలకోటలో గతంలో పని చేసిన ఓ పోలీస్ అధికారి తీరు వివాదాస్పదంగా మారింది. గతంలో ఇక్కడ పని చేస్తున్న సమయంలో వైసీపీకి సాను భూతిపరుడిగా ఉండేవాడు. అయితే పేదల బతుకుదెరువు నిమిత్తం వ్యవసాయం చేసుకోవ డానికి ప్రభుత్వం ఇచ్చిన డీకేటీ భూములను కొనుగోలు చేశాడు. సాధారణంగా పేద, నిరుపేదలకు జీవనాధారం కోసం ప్రభుత్వం డీకేటీ భూమిని మంజూరు చేస్తుంది. ఈ భూమిని వంశపారపర్యంగా అనుభవించుకోవాలి. నిబంధనల మేరకు ఇతరులకు క్రయ, విక్రయాలు చేయకూడదు. ఒకవేళ భూ యజమాని తన అవసరానికి అమ్మినా, తాకట్టు పెట్టినా నిబంధనల మేరకు చెల్లుబాటు కాదన్న విషయం బహిరంగ రహస్యమే. అలాంటి భూములను రైతుల నుంచి కాజేయాలని ఉద్దేశ్యంతో రకరకాల ప్రలోభాలకు గురి చేసి.. వారు అమ్మే విధంగా చేశాడు. అయితే కొంతమంది రైతులు భూముల అమ్మడానికి ససేమిరా అంగీకరించకపోవడంతో వారికి అదనంగా డబ్బులు చెల్లిస్తామని ఆశ చూపించారు. దీంతో రైతులు భూములు అతనికి అమ్మకాలు చేశారు. కురబలకోట మండలం కంటేవారిపల్లె సమీపంలో దాదాపు 6ఎకరాలకు పైగా కొనుగోలు చేశాడు. భూములు కొనుగోలు చేసిన సమయంలో అగ్రిమెంట్ సమయంలో కొంత సొమ్మును చెల్లించి భూమిని స్వాధీనం చేసుకున్నాడు. అనంతరం మిగిలిన మొత్తాన్ని తర్వాత చెల్లిస్తానని నమ్మబలికాడు. రెండేళ్లకు పైగా కావస్తున్నా ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదు. అంతేకాకుండా అనుభవంలో ఉన్న భూమి రైతుల నుంచి కాకుండా వేరే వ్యవక్తుల నుంచి కొనుగోలు చేసినట్లు తప్పుడు అగ్రిమెంట్‌లు సృష్టించి బెదిరిస్తున్నాడు. డబ్బుల కోసం ఆయన చుట్టూ తిరిగి పలుమార్లు అడిగినా పట్టించుకోవడం లేదు. దీనిపై పలువురు బాధిత రైతులు ఇటీవల మదనపల్లెకు వచ్చిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, సబ్‌కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశారు.

బినామీ పేరుతో కొనుగోలు చేశాడు..



కంటేవారిపల్లెలో మాకు 1882-2లో 87సెంట్ల డీకేటీ భూమి ఉంది. అయితే నేను ఆ భూమిని అమ్మడానికి నిరాకరించాను. మధ్యలో కొంతమంది నాకు డబ్బు ఆశ చూపి భూమిని అమ్మేలా ప్రేరేపించారు. అప్పట్లో నా భూమికి రూ.8లక్షలు ఇచ్చేలా నిర్ణయించారు. అనంతరం నా భూమిని స్వాధీనం చేసుకుని డబ్బులు ఇవ్వలేదు. నేను ఇప్పటి దాకా అగ్రిమెంట్‌పై సంతకాలు పెట్టలేదు. గతంలో కూడా భూమికి సంబంధించి కీ తీసేశారు. మళ్లీ నేను పై అధికారుల చుట్టూ తిరిగి కీ పెట్టించుకున్నాను. ఇప్పుడు నా భూమిని నాకు అప్పగించి న్యాయం చేయండి.

- వెంకటశిద్దులు, కంటేవారిపల్లె

మా భూమిని లాక్కుని.. మమ్మల్నే రానివ్వడం లేదు..



కంటేవారిపల్లెలో దాదాపుగా 85సెంట్లకు పైగా భూమి ఉంది. మా భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడు. మాతో పాటు ఇంకా కొంత మంది రైతుల భూములను లాక్కున్నాడు. మా భూమిలోకి ఎవ్వరూ వెళ్లకుండా అక్కడ వాచ్‌మెన్‌ను కాపలా పెట్టాడు. మా భూమి చూపించాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా.. వాళ్లు వచ్చి భూమిని కొలవడానికి ప్రయత్నం చేయగా వారికి ఫోన్ చేసి బెదిరిస్తున్నాడు. దీంతో వాళ్లు భయపడి వెళ్ళిపోయారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి.

- నరసింహులు, కంటేవారిపల్లె



కంటేవారిపల్లె సమీపంలో రైతుల నుంచి దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్న భూమి

ప్రముఖ నాటక రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్ మృతి



పల్లేటి లక్ష్మీ కులశేఖర్

రాయచోటి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నాటక రచయిత పల్లేటి లక్ష్మీ కులశేఖర్ శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం గడికోట కోటకాడపల్లెలో ఈయన 1954 డిసెంబర్ 3న పల్లేటి మరియమ్మ, విలియమ్స్ దంపతులకు జన్మించారు. తన 15వ ఏటనే రచనా ప్రస్థానాన్ని మొదలు పెట్టి 70 పౌరాణిక నాటకాలు, 40 సాంఘిక నాటకాలు, నాటికలు, 10 నృత్యనాటికలు, 250 వరకు ఆకాశవాణి నాటికలు, నాటకాలు, 8 దూరదర్శన్ నాటకాలు, నాటికలు రాశారు. ఉత్తమ రచయితగా.. దర్శకునిగా 10 నంది అవార్డులు, రచనల ప్రదర్శనలో మరో 78 నంది బహుమతులు పొందారు. ఈయనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న హంస, ఉగాది పురస్కారాలు, ప్రపంచ తెలుగు మహాసభల్లో అఖండ సన్మానాలు దక్కాయి. అష్టాదశ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేసి ఎందరో ప్రముఖుల చేత సన్మానాలు పొందారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారినుంచి గరుడ అవార్డు అందుకున్నారు.

వీరు సాంఘిక, చారిత్రక, పౌరాణిక నాటకాలతో పాటు నవలలూ రాశారు. వీరి నాటకాలు కొన్ని సినిమాలుగా కూడా వచ్చాయి. మృగతృష్ణ, ఆడది, చలిదీర్చిన చితిమంటలు, సమరం, అమ్మ(ను) కావాలి నవలలు కూడా రాశారు. పల్నాటి యుద్ధం, విశ్వకవి వేమన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, యోగివీరబ్రహ్మం, తాళ్లపాక అన్నమాచార్య తదితర చారిత్రిక నాటకాలు సైతం రాశారు. ఈయన రాసిన నాటికలు, నాటకాలన్నీ సవేరా ఆర్ట్స్ (కడప), లలితకళాసమితి (కర్నూలు), గీతానాటకమండలి (రాజంపేట) తదితర నాటక సమాజాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శించారు.

గుండెపోటుతో మృతి..

పల్లేటి లక్ష్మీకులశేఖర్ రైల్వేకోడూరులో స్థిరపడ్డారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమార్తెలు ముగ్గురికీ వివాహలయ్యాయి. కుమారుడు హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల అస్వస్థతగా ఉండటంతో కులశేఖర్‌ను గుంటూరు తీసుకెళ్లారు. అక్కడ వైద్య చికిత్సలు చేయించారు. వైద్యులు అన్ని పరీక్షలు చేసి ఆరోగ్యం బాగుందని చెప్పారు. దీంతో శుక్రవారం రాత్రి గుంటూరు నుంచి బస్సులో తిరుగుప్రయాణంలో ఉండగా మార్గమధ్యంలో గుండెపోటు రావడంతో మృతిచెందారని ఆయన పెద్దకుమార్తె ఇందిర తెలిపారు. శనివారం రైల్వేకోడూరులో ఆయన పార్థివదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా ప్రముఖ నాటక రచయిత అయిన పల్లేటి లక్ష్మీకులశేఖర్ మృతి నాటక రంగానికి తీరని లోటని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరు సాంఘిక, పౌరాణిక నాటకాలు రాయగల ఏకైక ప్రతిభాశాలి అని కొనియాడారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ప్రొద్దుటూరుకు చెందిన జింకా సుబ్రమణ్యంతో పాటు పలువురు రచయితలు నివాళి అర్పించారు.

తంబళ్లపల్లెలో డెంగ్యూ కలకలం

- ముగ్గురు బాలికలకు నిర్ధారణ
- అప్రమత్తమైన వైద్యాధికారులు





తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక రక్షిత, కవిత

తంబళ్లపల్లె, ఆగస్టు 10: తంబళ్లపల్లెలో డెంగ్యూ కలకలం సృష్టిస్తోంది. శనివారం తంబళ్లపల్లె మండల కేంద్రంలో ముగ్గురు బాలికలకు డెంగ్యూ నిర్ధారణ కావడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. తంబళ్లపల్లెకు చెందిన రక్షిత(10), రెడ్డికీర్తన(9), సిద్ధారెడ్డిగారిపల్లెకు చెందిన కవిత(14) నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. జ్వరం తగ్గకపోవడంతో శుక్రవారం కుటుంబసభ్యులు చికిత్సకోసం తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. వీరికి డెంగ్యూ అనుమానిత లక్షణాలు ఉండటంతో ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారి వెంకట్రామయ్య తెలిపారు. దీంతో అప్రమత్తమైన ఆయన వెంటనే రక్షిత, కవితను ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకుని వైద్య చికిత్స అందిస్తున్నారు. మరో బాలిక రెడ్డికీర్తన ఇంటివద్దే చికిత్స తీసుకుంటోంది. అనంతరం మరోమారు డెంగ్యూ నిర్ధారణ కోసం ముగ్గురి రక్త నమూనాలను శుక్రవారం సాయంత్రం మదనపల్లె జిల్లా వైద్యశాల ల్యాబ్‌కు పంపగా.. డెంగ్యూ నిర్ధారణ అయినట్లు శనివారం సమాచారం వచ్చింది. దీంతో వెంటనే రక్షిత, కవితను మెరుగైన వైద్య చికిత్స కోసం మదనపల్లె జిల్లా వైద్యశాలకు రెఫర్ చేశారు. ప్రస్తుతం ముగ్గురు బాలికల ఆరోగ్యం నిలకడగానే ఉందని డాక్టర్ వెంకట్రామయ్య తెలిపారు. ఎవరికైనా రెండు రోజులకు మించి జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి తగిన పరీక్షలు చేసుకుని చికిత్స తీసుకోవాలని అన్నారు.

దోమలు అరికట్టడంలో విఫలం

ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఎక్కడ చూసినా దోమలు విజృంభిస్తున్నా అరికట్టడంలో అధికారులు విఫలం అయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అధికారులు సమావేశాల్లో చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను పర్యవేక్షించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దోమల నివారణకు మురుగు నీటి కాలువల వెంట మందు పిచికారి, ఆయిల్ బాల్స్ వేయడం తదితర చర్యలు చేపట్టలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం..

డెంగీ ప్రబలినట్లు సమాచారం అందుతూనే అప్రమత్తమై ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించాం. లక్షణాలు ఉన్న వారికి టెస్టులు చేసి అవసరమైన మందులు అందిస్తున్నాం. వైద్య సిబ్బంది గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సీజనల్ వ్యాధులతో పాటు, జ్వరాలపై అప్రమత్తం చేస్తున్నాం. ఇళ్ల వద్ద, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటూ అవగాహన కల్పిస్తున్నాం. డెంగీ బాధితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ప్రస్తుతం డెంగ్యూ సోకిన ముగ్గురి ఆరోగ్యం నిలకడగానే ఉంది.

- మునికుమార్, కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి


పైన పటారం.. లోన లొటారం

పైన పటారం.. లోన లొటారం అనే నానుడికి బద్వేలులోని ప్రభుత్వ సామాజిక వైద్యకేంద్రము అతికినట్టు సరిపోతుంది. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి భవనాలు నిర్మించారు. అందంగా ఉండేలా రంగులేశారు. 50 పడకలు ఏర్పాటు చేశారు. కానీ పేద ప్రజలకు నాడిపట్టి వైద్యం చేసేందుకు తగినంత మంది వైద్యులను మాత్రం నియమించలేదు. దీంతో ఇక్కడ సరైన వైద్యం అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



- రూ.కోట్లతో ఆసుపత్రి నిర్మాణాలు
- కనీస సౌకర్యాలు శూన్యం
- గర్భకోశవ్యాధి నిపుణులు లేక మహిళల అవస్థలు
- చిన్నపిల్లల వైద్యులూ లేరు
- ఇదీ 50పడకల ప్రభుత్వ ఆసుపత్రి దుస్థితి


చిన్నపిల్లల వైద్యనిపుణులు లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్న వెంటిలేటర్


మరమ్మతులకు నోచుకోని అల్ట్రాస్కానింగ్ మిషన్

బద్వేలు టౌన్, ఆగస్టు 10: బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో 80వేలు, పంచాయతీ పరిధిలో 30వేల పైనే జనాభా ఉంది. వీరితో పాటు బద్వేలు ఆసుపత్రి పరిధిలో మరో 20 పంచాయతీలు ఉన్నాయి. ఈ ఆసుపత్రికి రోజూ 300 నుంచి 400మంది రోగులు వస్తుంటారు. అయితే వీరికి సరైన వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. బద్వేలు 50పడకల ఆసుపత్రిలో 12 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ఏడుగురు మాత్రమే వైద్యసేవలు అందిస్తున్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, చిన్నపిల్లల వైద్యులు, గైనకాలజిస్టులు లేరు.

పరికరాలు ఉన్నా నిరుపయోగం

లక్షల రూపాయలు వెచ్చించి బద్వేలు ప్రభుత్వ వైద్యశాలలో 5 వెంటిలేటర్లు, 50 బెడ్లు ఏర్పాటు చేశారు. అయితే వెంటిలేటర్లను వినియోగించేందుకు ఆ విభాగం వైద్యులు లేకపోవడంతో యంత్రాలు నిరుపయోగంగా మారాయి. అలాగే గర్భవతులకు అల్ట్రాస్కానింగ్ మిషన్ అందుబాటులో ఉన్నప్పటికీ గైనకాలజిస్టు లేరు. గర్భిణీ మహిళలు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకు ఓర్చి ఆసుపత్రులకు వస్తే ఇక్కడ గైనకాలజిస్టు లేకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. అలాగే చెవి, ముక్కు, గొంతుకు సంబంధించి వైద్యులు అందుబాటులో ఉన్నా.. సంబంధిత పరికరాలు లేకపోవడంతో వచ్చిన రోగులకు పూర్తిస్థాయిలో చికిత్స చేయలేక మందులతో సరిపెడుతున్నారు. అలాగే కంటి వైద్యనిపుణులు బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం, శనివారం మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. ఈ విషయం తెలియక ఆసుపత్రికి వచ్చిన రోగులు వైద్యులు లేక వెనుదిరుగుతున్నారు. నియోజకవర్గంలోనే ఇది పెద్ద ఆసుపత్రిగా పేరు పొందినప్పటికీ వైద్యుల కొరత ఉండటంతో సరైన వైద్యసేవలు అందక ప్రైవేటు ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పేద ప్రజలు గత్యంతరం లేక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వీరికి వేల రూపాయలు ఖర్చు తప్పడం లేదు. ఇప్పటికైనా బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను ఏర్పాటుచేసి సరైన వైద్యసేవలు అందించాలంటూ ప్రజలు కోరుతున్నారు.

అన్నివేళలా సేవలు..



సిబ్బంది కొరత ఉన్నా.. అన్ని వేళలా సేవలు అందిస్తున్నాం. వైద్యుల కొరత ఉందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లా. వైద్యులను నియమిస్తే పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించవచ్చు. అత్యవసర కేసులకు 24గంటలు అందుబాటులో ఉంటాను. అవసరమైతే 9440980369 నెంబరుకు ఫోన్‌చేస్తే పది నిమిషాల్లో ఆసుపత్రికి వచ్చి సేవలు అందిస్తున్నా.

- డాక్టర్ రాంప్రసాద్, డిప్యూటీ సివిల్‌సర్జన్

మోటార్లు పగులకొట్టి రాగితీగ చోరీ


స్టార్టర్‌లో తీగను తీసుకెళ్లారని చూపిస్తున్న రైతు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు10: గురయ్యగారి పల్లెలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ మోటార్లు పగులకొట్టి అందులో ఉన్న రాగితీగ అపహరించినట్లు రైతులు రెడ్డెయ్య, వెంకటసుబ్బయ్య, నరసింహులు, ఓబయ్య, వేణు తెలిపారు. ఒకేరోజు 6-7 మోటార్లు పగులకొట్టి, విద్యుత్ స్తంభం నుంచి తీసిన తీగను కాల్చి అందులో ఉన్న కాపర్‌ను అపహరించినట్లు రైతులు తెలిపారు. పంటలకు నీరు పారగట్టాలని వ్యవసాయ పంపుసెంట్ల వద్దకు వచ్చిన రైతులు చోరీ విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ...

వీరపునాయునిపల్లె, ఆగస్టు 10: మండల కేంద్రమైన వీరపునాయునిపల్లె సంగాలపల్లె మార్గమధ్యలోని జీఎన్ఎస్ఎస్ కాల్వకు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్నకాపర్ వైరు దాదాపు రూ.10వేల నుంచి రూ.20వేల దాకా విలువ చేస్తుందని రైతులు పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారని బాధితరైతు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కడప (క్రైం), ఆగస్టు 10 : కడప నగరం అప్సర సర్కిల్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయని చిన్నచౌకు పోలీసులు తెలిపారు. కడప మాసాపేటకు చెందిన ఉమామహేశ్వర్‌రావు సొంత పని నిమిత్తం అప్సర వద్దకు వస్తుండగా దారిలో పెట్రోలు అయిపోయింది. దీంతో సమీపంలోని పెట్రోలు బంకు వద్దకు బైకు తోసుకుంటూ వెళుతుండగా అప్సరా నుంచి కృష్ణసర్కిల్‌కు వెళుతున్న ఇంటర్ సెకండియర్ చదువుతున్న సుఖవనంరాజు కేటీయం బైకులో వచ్చి ఢీకొట్టాడు. దీంతో ఉమామహేశ్వర్‌రావు కాలు విరిగి ఇంటర్ విద్యార్థి సుఖవనంరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఇరువురిని రిమ్స్‌కు తరలించగా మెరుగైన వైద్యం కోసం సుఖవనం రాజును కడపలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

కడప (క్రైం), ఆగస్టు 10 : కడప నగరం తారకరామానగర్‌లో గంజాయి విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు తారకరామానగర్‌కు చెందిన క్రిష్ణవేణి గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆమెను అరెస్టు చేసి కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పూర్వవిద్యార్థులు తోడ్పాటునివ్వాలి

మదనపల్లె టౌన్, ఆగస్టు 10: మదనపల్లెలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పాటునివ్వాలని ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తొలిసారిగా పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో విద్యా ర్థుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి అనుగుణంగా అన్ని డిగ్రీ కోర్సుల్లో మెరుగైన బోధనలు అందిస్తున్నామన్నారు. విద్యార్థి నులకు అనుకూలంగా ఉన్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడంలో పూర్వ విద్యార్థులు సహక రించాలని కోరారు.

ట్రిపుల్ ఐటీలో 309 సీట్లు ఖాళీ

నూజివీడు టౌన్, ఆగస్టు 10: ఆర్జీయుకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మొదటి, రెండు విడతల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తికాగా 309 సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. మొత్తం నాలుగు క్యాంపస్‌లకు గాను 4 వేల ట్రిపుల్ ఐటీ సీట్లకు మరో 400లు సూపర్ న్యూమరీ సీట్లు కలిపి 4,400 సీట్లకు ఆర్జీయుకేటీ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించింది. నాలుగు క్యాంపస్‌ల మీద 753 సీట్లు మిగలగా రెండో విడత కౌన్సెలింగ్‌లో 444 సీట్లు భర్తీ అయ్యి 309 సీట్లు మిగిలాయి. వీటికి త్వరలో మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించనున్నట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు.

వీరభద్రస్వామికి 44 గ్రాముల బంగారు ఆభరణాల వితరణ


వీరభద్రస్వామికి బంగారు ఆభరణాలను వితరణ చేస్తున్న కన్నడ భక్తులు

రాయచోటిటౌన్, ఆగస్టు10: రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి శనివారం కర్ణాటక రాష్ట్రం రాయచూరు వాసులు అనసూయ, హిరేమట్ కుటుంబ సభ్యులు రూ.3.23 లక్షల విలువ చేసే 44 గ్రాముల 920 మిల్లీగ్రాముల బరువు గల బంగారు మీసం, రెండు కళ్లను ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీ రమణారెడ్డికి అందజేశారు.

ఈ సందర్భంగా దాతలు అందజేసిన బంగారు నగలకు ఆలయ సిబ్బంది రసీదున ఇచ్చి, ఆలయ ఉప ప్రధాన అర్చకులు శంకరయ్య దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి పట్టువస్త్రాలతో సత్కరించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందజేశారు.

మదనపల్లె పోలీస్ సబ్‌డివిజన్‌లో 13 మంది ఎస్‌ఐల బదిలీలు

మదననపల్లె టౌన్, ఆగస్టు 10: మదనపల్లె పోలీసు సబ్‌డివిజన్‌లోని 13 పోలీసేస్టేషన్‌లలో పనిచేస్తున్న ఎస్‌ఐలను బదిలీ చేస్తూ కర్నూల్ రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లె వన్ టౌన్ ఎస్‌ఐ-1గా కడప డీఎస్‌బీలో పనిచేస్తున్న అన్వర్‌బాషాను, ఎస్‌ఐ-2గా వాల్మీకిపురం నుంచి బి.శ్రీనివాసులునాయక్‌ను బదిలీ చేశారు. అలాగే మదనపల్లె టు టౌన్ ఎస్‌ఐ-1గా కేవీపల్లె నుంచి ఎస్‌కే రహీముల్లా, ఎస్‌ఐ-2గా పి.కృష్ణమూర్తిని బదిలీ చేశారు. మదనపల్లె తాలూకా ఎస్‌ఐ-1గా హరిహరప్రసాద్, ఎస్‌ఐ-2 గా పి.వి.రమణను బదిలీ చేశారు. ముదివేడు ఎస్‌ఐగా పీలేరు నుంచి దిలీప్‌కుమార్‌ను, నిమ్మనపల్లె ఎస్‌ఐగా బైరెడ్డిపల్లె నుంచి బి.కృష్ణయ్యను, రామసముద్రం ఎస్‌ఐగా మదన పల్లె తాలూకా నుంచి రవికుమార్‌ను, ములకలచెరువు ఎస్‌ఐగా రాయచోటి దిశా నుంచి గాయత్రిని, తంబళ్లపల్లె ఎస్‌ఐగా నిమ్మనపల్లె నుంచి లోకేశ్‌రెడ్డి, పెద్దమండ్యం ఎస్‌ఐగా సోమల నుంచి కె.శివశంకరను, పీటీఎం ఎస్‌ఐగా పీలేరు నుంచి ఎంకె నరసింహులును బదిలీ చేశారు.

విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమమమే ధ్యేయం


యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 10 : విద్యారంగ పరిరక్షణ ఉపాధ్యాయుల సంక్షేమం యూటీఎఫ్ ధ్యేయమని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిపాలెం మహేశ్‌బాబు పేర్కొన్నారు. శనివారం కడప నగరంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ ఉపాధ్యాయ సంక్షేమమే పరమావధిగా పనిచేస్తోందని, భవిష్యత్తులో కూడా ఇదే వైఖరి కొనసాగిస్తుందన్నారు. గడిచిన 50 సంవత్సరాల్లో యూటీఎఫ్ సాధించిన విజయాలు నెమరువేసుకుంటూ ఆ నాటి నాయకుల త్యాగనిరతి, అంకితభావం, సంఘనిబద్ధతను సమాజశ్రేయస్సు కోసం వారు చేసిన కృషి స్మరించుకుని వారి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షురాలు సుజాతరాణి, కార్యదర్శులు పీవీ రమణ, ఎజాజ్ అహ్మద్, ప్రభాకర్,రూత్ ఆరోగ్యమేరీ, వీరనారాయణ,విజయచంద్రారెడ్డి, సుబ్బారావు, గురుమోహన్‌తో పాటు యూటీఎఫ్ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యాపారి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 10 : రామేశ్వరానికి చెందిన క్రిష్ణారెడ్డి (51) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. క్రిష్ణారెడ్డి రామేశ్వరంలో గదిని బాడుగకు తీసుకుని అగరవత్తుల చేస్తుండేవాడు. రోజులాగా వ్యాపారం చేసేందుకు వెళ్లాడు. అలా వెళ్లిన వాడు ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య అక్కడికి వెళ్లారు. కాగా అక్కడ ఉరివేసుకుని చనిపోయినట్లు గుర్తించారు. అప్పుల వల్లనే ఉరి వేసుకున్నట్లు ఫిర్యాదులో ఆమె తెలపడంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

స్వల్ప ఆధిక్యతలో కృష్ణా, వెస్ట్‌గోదావరి, విశాఖ జట్లు





అత్యధిక పరుగులు సాధించిన వరుణ్‌సాత్విక్ (147), యశ్వంత్ (132), ఖాజామొహిద్దీన్ (133), పరమ్‌వీర్‌సింగ్ (128)


6 వికెట్లు తీసిన రేవంత్‌నాగకుమార్

కడప (స్పోర్ట్స్), ఆగస్టు 10: కడపలోజరుగుతున్న ఏసీఏ అండర్-19 ఇంటర్ డిస్ట్రిక్ట్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లలో రెండవరోజైన శనివారం తమ ప్రత్యర్థి జట్లపై కృష్ణా, వెస్ట్ గోదావరి, విశాఖపట్నం జట్లు స్వల్ప ఆధిక్యత సాధించాయి. వివారాలిలా....

- నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప- కృష్ణా జట్ల మధ్యసాగుతున్న మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు తొలుత బ్యాటింగ్ చేపట్టి 77.1 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌట్ అయింది. తదుపరి బరిలోకి దిగిన కృష్ణా జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో రెండవరోజైన శనివారం ఆట ముగిసే సమయానికి 105 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 335 పరుగుల భారీ స్కోర్ దిశగా సాగుతోంది. ఇందులో వరుణ్‌సాత్విక్ (బ్యాటర్) 147 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. మరో బ్యాటర్ ఖాజామొహిద్దీన్ 133 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేశారు. దీంతో ఇప్పటివరకూ కడప జట్టుపై 76 పరుగుల ఆధికత్యత దిశగా కృష్ణా జట్టు సాగుతోంది.
- నగర శివారు ప్రాంత కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో శ్రీకాకుళం- వెస్ట్ గోదావరి జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో వెస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 74.4 ఓవర్లలో 231 పరుగులకు ఆలౌట్ అయింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు 80.1 ఓవర్లలో 243 పరుగులు చేసింది. కాగా బౌలింగ్ విభాగంలో వెస్ట్‌గోదావరి బౌలర్ రేవంత్ నాగకుమార్ 6 వికెట్లు పడగొట్టడం విశేషం. ఇదిలావుండగా రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 22 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 66 పరుగులు చేసింది. దీంతో ఇప్పటి వరకూ 54 పరుగుల ఆధికత్యలో వెస్ట్‌గోదావరి జట్టు ముందుకుసాగుతోంది. ఆదివారం ఆటకు చివరిరోజు.
- నగర శివారు ప్రాంత కేఎస్ఆర్ఎం మైదానంలో నెల్లూరు- విశాఖపట్నం జట్లమధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ దిగిన నెల్లూరు జట్టు 85.2 ఓవర్లలో 331 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో విశాఖ బౌలర్ రచిత్ 5 వికెట్లు సాధించారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో రెండవ రోజైన శనివారం ఆట ముగిసే సమయానికి 89 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 381 పరుగులు చేసింది. ఇందులో యశ్వంత్ (బ్యాటర్) 132 పరుగులు చేయగా మరో బ్యాటర్ పరమ్‌వీర్‌సింగ్ 128 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు.

'అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలి'

ములకలచెరువు, ఆగస్టు 10: అన్నమయ్య జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో అన్యాక్రాంతమైన భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు తోపు కృష్ణప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం మండల కార్యదర్శి అంజనప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ బాధితుల సమస్యలపై ఈ నెల 12వతేదీన జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అన్యాక్రాంతమైన భూములను ప్రస్తుత ప్రభుత్వం స్వాధీనం చేసుకుని చిన్నకారు, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు పంపిణీ చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి 25 ఎకరాలకు మించి ఉండకూడదని చట్టం చెబుతుంటే రాజకీయ నాయకులు వేలాది ఎకరాలు ఎలా సంపాదిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.

స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని లోహితారెడ్డి

కురబలకోట, ఆగస్టు 10: మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన లోహితారెడ్డిని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో తృతీయ సంవత్సరం ఏఐ విభాగానికి చెందిన లోహితారెడ్డి ఎన్‌సీసీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు తెలిపారు. కాగా ఎంపికైన విద్యార్థిని ఈ నెల 15న విజయవాడలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థిని కరస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ అభినందించారు.

రాయచోటిలో పిచ్చికుక్క స్వైర విహారం

- వివిధ ప్రాంతాల్లో 30 మందిపై దాడి




పిచ్చికుక్క దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులు

రాయచోటిటౌన్, ఆగస్టు 10: రాయచోటిలో శనివారం ఓ పిచ్చికుక్క స్వైర్య విహారం చేసి 30 మందిపై దాడి చేసింది. వివిధ ప్రాంతాల్లో పిచ్చికుక్క తిరుగుతూ పలువురిపై దాడి చేయడంతో బాధితులంతా రాయచోటి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శని వారం ఉదయం 10, 11 గంటలకు రవిహోల్, రాణా, కొత్తపల్లి, బ్రాహ్మణవీధి, ఏరియా ఆస్పత్రి, కొత్తపేట, నేతాజీ సర్కిల్ తదితర ప్రాంతాల్లో సుమారు 30 మందిపై కుక్క దాడి చేసింది. పిచ్చికుక్క దాడి విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ వాసు బాబు తన సిబ్బందితో పట్టణంలో కుక్క ఏప్రాంతంలో తిరుగుతుందో గుర్తించి కుక్కను పశువైద్యశాలకు తరలించి వ్యాక్సినేషన్ ఇప్పించారు. కాగా, కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించా లని రాయచోటి మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే 'వారధి'కి శ్రీకారం

- బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్

రాయచోటిటౌన్, ఆగస్టు10: ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ రాష్ట్ర అధినాయకత్వం 16న వారధి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ అన్నారు. శనివారం ఆయన రాయచోటిలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో ప్రజలు, పార్టీ శ్రేణుల సమస్యలను పరిష్కరించేందుకు వారధికి శ్రీకారం చుడుతోందన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి శ్రీనివాస్‌వర్మ, మంత్రి సత్యకుమార్, రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఎంపీ సీఎం రమేశ్ సహా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీజేపీ కీలక నేతలు అందుబాటులో ఉంటూ వారధిలో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు బీజేపీ మొదటి సారిగా వారధిని తీసుకురావడం శుభపరిణామమన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాసరాజు, బీజేపీ నేతలు మహేశ్‌రాజు, నిర్మల్‌కుమార్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలి

రాజంపేట, ఆగస్టు 10: విశాఖపట్టణంలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు తుమ్మ రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎమ్మెస్ రాయుడు, పట్టణ కార్యదర్శి సికిందర్ కోరారు. శనివారం ఏఐటీయూసీ కార్యాలయ ఆవరణలో జాతీయ సమితి సమ్మేళనాల పోస్టర్లను ఆవిష్కరించిన వారు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో విశాఖల సమ్మేళనాలను నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో కార్మిక సమస్యలు పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. 30 ఏళ్లగా ప్రభుత్వాలు ఎల్పీజీ విధానాలను అమలు చేస్తుండడంతో కార్పొరేట్ బడా పారిశ్రామికవర్గం రాజ్యమేలుతోందన్నారు. దీంతో కార్మికులకు పని భద్రత కరువైందని, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలన్నీ చట్టుబండలైపోతున్నాయన్నారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ రోజువారి కూలీ విధానాలు అతి కర్కశంగా అమలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులు, ప్రభుత్వ స్కీమ్ ఉద్యోగులను కట్టుబానిసలుగా మార్చివేస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారన్నారు. టీడీపీ నేతలు కొన్ని ప్రాంతాల్లో అంగన్వాడీ, ఆశా, మిడ్డేమీల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాల పట్ల వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న చిరుద్యోగులపై రాష్ట్రంలో అధికార పార్టీ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారని అలాంటి చర్యలు మానుకుని నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేత నాగేశ్వరరావు, ఆటో వర్కర్స్ నేతలు మౌలా, రమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నేత జమాల్ హమాలి, యూనియన్ నేతలు రాఘవేంద్ర, లక్ష్మన్న, రామాంజనేయులు, లింగన్న, నరసింహులు, నరసింహా, సాయి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన యువనేత ముక్కా



మంత్రి రవీంద్రతో ముక్కా సాయివికాస్‌రెడ్డి

ఓబులవారిపల్లె, ఆగస్టు 10: రాజధాని అమరావతిలో గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్రను టీడీపీ యువనేత ముక్కా సాయివికాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో మాట్లాడుతూ మంగంపేటలో ఉన్న ఏపీఎండీసీ సామాజిక బాధ్యత వహించి నియోజకవర్గంలోని గ్రామాల్లోని ప్రజలకు అభివృద్ధికి మౌలిక వసతుల కల్పనకు, యువతకు ఉద్యోగ ఉపాధిలో అవకాశాలను కల్పించడంలో భాగస్వాములు కావడం వల్ల మరింత మేలు జరుగుతుందన్నారు. పలు గ్రామాలకు మంచినీటి సౌకర్యం, వికలాంగులకు చేయూత, మహిళ స్వయం సంవృద్ధి సాధించడం కోసం శిక్షణ, పేద ప్రజలకు నాణ్యమైన విద్య అందించడం వంటివి ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరారు. కోడూరు ప్రజలకు ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరగా సహకారమందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మంత్రి నారాయణను కలిసిన ఉపాధ్యాయ సంఘం



మంత్రిని కలిసిన ఉపాధ్యాయ బృందం

రామాపురం, ఆగస్టు10: పురపాలకశాఖ మంత్రి నారాయణను అన్నమయ్య జిల్లా రామాపురం మండలం తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం బృందం శనివారం కలిశారు. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం బృందం తెలిపిన మేరకు నెల్లూరులోని మంత్రి నివాసంలో కలిసి జీఓ నెంబర్ 117నురద్దు చేయాలని, పాఠశాల నిర్వహణ నిధులను సకాలంలో వచ్చేలా చూడాలని వారు మంత్రిని కోరారు. తెలుగు నాడు జిల్లా ఉపాధ్యాయ సంఘం బృందం పిచ్చిరెడ్డి, రామచంద్ర, సంజీవరెడ్డి, సుబ్రమణ్యం, సుధాకర్, మనోహర్‌రెడ్డి, పీడీ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్‌ను కలిసిన రామాశ్రీనివాస్



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఆగస్టు10: రాజంపేట పార్లమెంట్ జనసేన నేత రామాశ్రీనివాస్ శనివారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాజంపేట పార్లమెంట్ పరిధిలో పార్టీ స్థితిగతులపై ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో స్వాతంత్ర దినోత్సవంలో ప్రతి సర్పంచ్ తలెత్తుకుని గౌరవంగా జెండా వందనం చేసే రోజులు వచ్చాయని హర్షం వ్యక్తం చేశారు.

శ్రీవారి ఆలయంలో శ్రావణ శనివారం వేడుకలు



గాలివీడు, ఆగస్టు10: స్థానిక బ్రాహ్మణవీధిలో కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం తొలి శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే మూలవిరాట్టు మూర్తిని తులసీదళాలతో విశేషంగా అలంకరించారు. భక్తి శ్రద్ధలతో స్వామి వారికి అభిషేకాలు, నైవేద్యాలను సమర్పించారు. ఉదయం నుంచే స్వామి వారి దర్శనార్థం భక్తులు బారులు తీరారు. అర్చకులు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ శివకేశవులకు ప్రీతికరమైన మాసంలో కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని నియమ నిష్టలతో పూజించి ఆరాధిస్తే శని బాధలు తొలగిపోతాయన్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

హక్కులు, బాధ్యతలే యూటీఎఫ్ కళ్లు

- యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవ జెండా ఆవిష్కరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్



రాయచోటి అలీమాబాద్ వీధి ఉర్దూ పాఠశాలలో, నందలూరు, పెనగలూరులో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

రాయచోటిటౌన్, ఆగస్టు10: సమాజంతో కలిసి సమస్యలపై పోరాడుతున్న ఉద్యమ సంఘం యూటీఎఫ్ హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా ముందుకు సాగుతోందని అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. జాబీర్ పేర్కొన్నారు. యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక అలీమాబాద్ ఉర్దూ హైస్కూల్ ఆవరణలో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లలో యూటీఎఫ్ సాధించిన విజయాలను నెమరు వేసుకున్నారు. ఒక వైపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే మరో వైపు పాఠశాలల పరిరక్షణకు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తున్న ఉద్యమ సంఘం యూటీఎఫ్ అన్నారు. 1975లో వచ్చిన మూడో పీఆర్సీలో ఎన్జీఓలతో సమానంగా ఉపాధ్యాయుల వేతనాలు సాధించడం మొదటి విజయం కాగా, 1979లో ఎన్జీఓల కంటే అదనంగా ఒక స్టేజీ వేతనాలు సాధించామన్నారు. 1886లో రీగ్రూపింగ్ స్కేల్స్ ద్వారా సర్వీసును బట్టి పదోన్నతి పేస్కేలు వచ్చేలా కృషి చేసిందన్నారు. భాషా పండితులకు గ్రేడ్ వన్‌స్కేల్, మున్సి పల్ ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయులకు సర్వీస్‌రూల్స్, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు నేరుగా జీతాలు, 1998 లో ఉపాధ్యాయ బదిలీల కౌన్సెలింగ్ విధానం, అప్రెంటిస్ విధానం రద్దు చేయించడం, రెండు నోషనల్ ఇంక్రిమెంట్ల సాధన, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు రెండు నోషల్ ఇంక్రిమెంట్లు సాధించడం కూడా యూటీఎఫ్ ఘనతే అన్నారు. విద్యార్థుల కోసం టెస్ట్ టెస్ట్ పేపర్లు అనుభవజ్ఞులచే తయారు చేయించి అందుబాటు ధరలో అందించడమే కాకుండా అనేక సామాజిక ఉద్యమాల్లో భాగస్వామిగా యూటీఎఫ్ ముందు వరుసలో ఉందన్నారు. ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కోవిడ్‌ను ఎదుర్కొని ప్రజలకు మనోధైర్యం అందించడం, నిరుపేదలను ఆదుకోవడంలోనూ యూటీఎఫ్ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని యూటీఎఫ్ కార్యాలయాలను కోవిడ్ ఐసోలేషన్ సెంటర్లుగా మార్చి కార్యకర్తలే పనిచేశారన్నారు. యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ప్రసాద్, రాయచోటి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హఫీజుల్లా, రాజారమేశ్, చిన్నమండెం మండల సహాధ్యక్షుడు కిఫాయితుల్లా, జిల్లా కౌన్సిలర్లు రెడ్డిమణి, సుధాకర్, వివిధ మండలాల యూటీఎఫ్ నేతలు నరసింహారెడ్డి, రాజేంద్ర, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీలేని పోరాటాలు యూటీఎఫ్‌కే సాధ్యం

నందలూరు, ఆగస్టు 10: రాజీలేని సమరశీల పోరాటాలు యూటీఎఫ్‌కే సాధ్యమని నందలూరు యూటీఎఫ్ సీనియర్ నేతలు షేక్ రౌఫ్‌బాషా, మస్తాన్ రెడ్డి, శామ్యూల్, శివవరప్రసాద్ పేర్కొన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు పురస్కరించుకుని స్థానిక జడ్పీహైస్కూల్ వద్ద యూటీఎఫ్ పతాకాన్ని మండల శాఖ అధ్యక్షుడు ముక్కర హరినాథ్, కార్యదర్శులు కృపానందం, సుధాకర్ ఆవిష్కరించారు. గడిచిన 50 ఏళ్లల్లో విద్యారంగానికి ఉపాధ్యాయులకు ఎన్నో హక్కులను, సౌకర్యాలను సాధించిన ఘనత ఒక్క యూటీఎఫ్‌కే దక్కుతుందన్నారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో పనిచేస్తున్న యూటీఎఫ్ కేవలం ఉపాధ్యాయుల సమస్యలకే పరిమితం కాకుండా పలు సామాజిక కార్యక్రమాల్లో సైతం పాలు పంచుకుంటోందన్నారు. కార్యక్రమంలో టీయూఎఫ్ కమిటీ సభ్యులు బిజయ్య, ఇమామ్‌బాషా, ఆనంద్, నారాయణ, రెడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరులో....

పెనగలూరు, ఆగస్టు 10: యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.హరిప్రసాద్ అధ్యక్షతన శనివారం పెనగలూరు ఉన్నత పాఠశాల సమీపంలో యూటీఎఫ్ ఉపాధ్యాయ నేతలు స్వర్ణోత్సవాలు చేసుకున్నారు. యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించి విజయోత్సవ నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వినోద్‌కుమార్, నాయకులు ఇండ్ల గంగాధర్ బాబు, బి.రమణయ్య, సుబ్బరాయుడు, మహేష్‌నాయుడు, కేవీ రమణయ్య, ఖాదర్ బాషా, కె.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వినాయకుడి కల్యాణోత్సవం

భక్తులతో కిటకిటలాడిన కొత్తపల్లి గ్రామం



పి.కొత్తపల్లెలో నిర్మించిన మండపంలో కల్యాణం నిర్వహిస్తున్న విశ్వనాథ్‌రెడ్డి దంపతులు

పెనగలూరు, ఆగస్టు 10: పి.కొత్తపల్లిలో ప్రజల రూ. 50 లక్షల విరాళాలతో నిర్మించిన నూతన కార్యసిద్ధి వినాయకస్వామి దేవాలయ ప్రాంగణలో సిద్ధి, బుద్ధి సమేత కార్య సిద్ధి వినాయకుని కల్యాణోత్సవం కన్నులపండుగగా జరిగింది. పురోహితుడు పి.చెంచుసుబ్బనరసయ్య శర్మ అధ్యక్షతన టీటీడీ వేద పాఠశాలకు చెందిన ప్రముఖ పూజారి జూటూరు నరసింహశర్మ సారథ్యంలో 12 మంది పండితుల బృందం కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పి.కొత్తపల్లికి చెందిన మీగడ విశ్వనాథ రెడ్డి, చైతన్యకుమారి, మనుకూరి అజిత్‌రెడ్డి, వైష్ణవి దంపతుల సహకారంతో కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రకృతి పుష్ప సోయగాలు విద్యుత్ కాంతుల ఆకర్షణలతో వినాయక స్వామి దేవాలయం, మండపం దేదీప్యమానంగా వెలుగొందాయి. కల్యాణోత్సవం అనంతరం విశ్వనాద్‌రెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. తలమంచి గిరీష్ రెడ్డి చారిటబుల్ ట్రస్టు సభ్యులు చంద్రబాబు రెడ్డి, ధనుంజయరెడ్డి, సందీప్ రెడ్డి, మాజీ సర్పంచి నరసింహారెడ్డి, టి.సుబ్బారెడ్డి, దేవాలయం మూలవిరాట్టు సమర్పకులు తలమంచి రమణారెడ్డి, చంద్రకళ దంపతులు పాల్గొన్నారు.

వైభవంగా నాగారపమ్మకు పూజలు

పుల్లంపేట, ఆగస్టు 10: వత్తలూరులో వెలసిన గ్రామ దేవత నాగారపమ్మకు గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న తిరుణాళ్లలో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం నాగారపమ్మకు మహిళలు పొంగుబాళ్లు పెట్టి జాతర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గ్రామాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

రేపటి నుంచి సర్పంచులకు శిక్షణ

సిద్దవటం, ఆగస్టు 10: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో 12 నుంచి 14వ తేదీ వరకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ పులిరాంసింగ్ తెలిపారు. పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, గ్రామాల్లో వీధి దీపాలు, విద్యుత్ బిల్లుల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణ రోజు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. సర్పంచులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు జనసేన కార్యకర్తల సమావేశం

రైల్వేకోడూరు, ఆగస్టు 10: స్థానిక సిద్ధేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు జనసేన సీనియర్ నేత ముద్దపోలు సభాపతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తదితరులు హాజరవుతున్నారన్నారు. రైల్వేకోడూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు మండలాల కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున హాజరు కావాలని కోరారు.

ఆలయాల్లో శ్రావణ మాస పూజలు

సంబేపల్లె, ఆగస్టు10: మండల వ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణ శనివారం పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పాలబండ వీరాంజనేయస్వామి ఆలయం గుట్టపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు, భజన, సంకీర్తనలు చేపట్టారు.

ఘనంగా రాములోరి విగ్రహ ప్రతిష్ఠ కల్యాణం



రామాపురం, ఆగస్టు10: కల్పనాయునిచెరువు గ్రామం అగ్రహారంలో నిర్వహించిన హనుమాన్ సమేత సీతారామ లక్ష్మణ స్వాముల ధ్వజ స్తంభ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. అనంతరం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం మూలవిరాట్టు ఉత్సవమూర్తుల గ్రామోత్సవం అనంతరం తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు. ఎర్రని నరసింహులు కుటుంబీకులు గ్రామానికి హనుమాన్ సీతారాముల ధ్వజ స్థంభ, విగ్రహ ప్రతిష్ఠ, సీతారాముల గ్రామోత్సవాలు చేశారు. వేదపండితులతో విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు.

వేడుకగా సీతారాముల కల్యాణం

సుండుపల్లె, ఆగస్టు10: సీతారామచంద్రస్వామి, లక్ష్మణ, హనుమ నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా శనివారం సొంతంవారిపల్లె ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కొత్తగా నిర్మించిన ఆలయంలో మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు. శనివారం సీతారాముల కల్యాణం అంగరంగ నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. హాజరైన భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు. అన్నదానం చేపట్టారు.

గాండ్లపల్లిలో...

చిన్నమండెం, ఆగస్టు10: వండాడి పంచాయతీ గాండ్లపల్లిలో శ్రావణ శనివారం సందర్భంగా సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. మహోత్సవంలో గ్రామస్థుల ఆహ్వానం మేరకు విచ్చేసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా ముత్తుమారెమ్మ గ్రామోత్సవం



ముత్తుమారెమ్మతల్లి గ్రామోత్సవం

నందలూరు, ఆగస్టు 10: అరవపల్లెలో వెలసిన ముత్తుమారెమ్మతల్లి గ్రామోత్సవం శనివారం రాత్రి అత్యంత ఘనంగా జరిగింది. నెల్లూరుకు చెందిన శేలం సురేష్, శేలం సుధాకర్ అమ్మవారికి ఉభయాన్ని అందజేశారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, కాంతారా నృత్యాలు, భజన బృందాలు, బాణసంచా నడుమ గ్రామోత్సవం కొనసాగింది. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

భక్తులకు అన్నదానం

అరవపల్లెలో ముత్తుమారెమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. నీలిపల్లె వాసులు ఉప్పుశెట్టి ఆదినారాయణ, లక్ష్మీదేవి, ఉప్పుశెట్టి సుధీర్‌కుమార్, ఉప్పుశెట్టి పృథ్విరాజ్ ఆధ్వర్యంలో 1500 మందికి భోజనాన్ని అందజేశారు. ముందుగా ఆలయంలో నిర్మించిన కుంకుమ పూజలో మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంబు సూర్యనారాయణ, టీడీపీ నేత మోడపోతుల రాము, ఉప్పుశెట్టి సుధీర్, కిరణ్‌కుమార్, లయన్స్ కుర్రా మణి యాదవ్, గురుప్రసాద్, కానకుర్తి వెంకటయ్య, సునీల్‌రెడ్డి, ధన గండికోట కృష్ణ, లైన్‌మెన్లు శ్రీరాం, కిరణ్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే



కాలిపోయిన దుకాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, ఆగస్టు 10: బాధితులను ఆదుకుంటామని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. శనివారం అగ్ని ప్రమాదానికి గురైన దుకాణాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ శవాకుల సిద్దయ్య టిఫిన్ సెంటర్, చెంగయ్య, సంజీవరెడ్డి కూల్‌డ్రింక్స్ షాపులు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయాయని తెలిపారు. దుకాణాల్లో ఉన్న వస్తువులు పూర్తి కాలిపోయినట్లు తెలిపారు. కాలిపోయిన షాపులను పరిశీలించామన్నారు. బాధితులకు అండగా నిలిచి ప్రభుత్వం ద్వారా అందించే సాయానికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డిప్రసాద్, ఆర్ఐ రాజశేఖర్, జనసేన నేతలు పీసీఎన్ బ్రదర్స్, జోగినేని మణి, వరికూటి నాగరాజు, గిద్దలూరు భాను, చలపతి, శంకర్, అరవింద్, ఉంగరాల చిన్నా, రాకేష్, షేక్ గౌస్, అంకిపల్లి మధు, వెంగయ్య, ప్రేమ్, రామయ్య అరవ నాని, తదితరులు పాల్గొన్నారు.

జిరాక్స్ స్కానర్ మిషన్ వితరణ



జిరాక్స్ స్కానర్‌ను అందజేస్తున్న వీరారెడ్డి

నందలూరు, ఆగస్టు 10: పాటూరు జడ్పీ హైస్కూల్‌కు అదే పాఠశాల విశ్రాంత టీచర్ కె.వీరారెడ్డి జిరాక్స్ స్కానర్ వితరణగా అందజేశారు. దాత మాట్లాడుతూ ఇదే పాఠశాలలో దాదాపు ఎనిమిదేళ్లు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించామన్నారు. ఉపాధ్యాయులు, ప్రజలు, విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి ఎంతో సహకరించారని, తనవంతు విద్యార్థులకు, పాఠశాలకు ఉపయోగకరమైన జిరాక్స్ స్కానర్‌మిషన్ అందజేశానన్నారు. ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాధురి స్కూల్ ఆకస్మిక తనిఖీ

సుండుపల్లె, ఆగస్టు10: ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఆర్జేడీ శ్యాముల్ తెలిపారు. శనివారం ఆకస్మికంగా మాధురి స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఫీజు వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయరాదన్నారు. అనంతరం పాఠశాల సిబ్బందితో మాట్లాడారు. విద్యతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



సుండుపల్లె, ఆగస్టు10: మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా ప్రారంభించారు. శనివారం అగ్ని ప్రతిష్ఠ, గణపతి హోమం, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదివారం ఆలయంలో మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రాణ ప్రతిష్ఠ చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండల నలుమూలల నుంచి భక్తులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలన్నారు.

హత్యలకు కేరాఫ్ జగన్‌రెడ్డి.. అభివృద్ధికి కేరాఫ్ చంద్రబాబు

వివేకా హత్య కేసులో జగన్‌రెడ్డి ఏమి చేశారు : టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా



రాయచోటిటౌన్, ఆగస్టు10: వైసీపీ ప్రభుత్వంలో హత్యలకు కేరాఫ్‌గా జగన్‌రెడ్డి నిలిచాడని, అభివృద్ధికి కేరాఫ్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు నిలిచారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో నేరాలు- ఘోరాల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిపిన విధ్వంసకర ఘనచరిత్ర జగన్‌రెడ్డికే దక్కుతుందని ధ్వజమెత్తారు. జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ఉనికి కోసం రాష్ట్రంలో నానా రాద్ధాంతాలు చేస్తున్నాడని, సొంత బాబాయ్ వివేకాను అత్యంత కిరాతకంగా నరికి చంపితే జగన్ ఏమి చేశారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. నంద్యాల జిల్లాలో వైసీపీ కార్యకర్త సుబ్బరాయుడును స్నేహితుడు శ్రీనివాస్‌రెడ్డి హత్య చేస్తే దానిని టీడీపీ వాళ్లపై నెట్టేయడం జగన్ నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. వ్యక్తిగత కక్షలతో హత్యలు జరిగితే వాటికి టీడీపీకి సంబంధం ఏమిటని ఆయన ప్రశ్నించారు. నంద్యాలలో అబ్దుల్‌సలాం భార్యాబిడ్డలు సహా ఆత్మహత్య చేసుకుంటే కారకులపై ఎందుకు చర్యలు తీసుకోలేదో జగన్ చెప్పాలన్నారు. కర్నూలు జిల్లా ఎర్రబాడు వాసి హాజీరాను మానభంగం చేసి హత్య చేస్తే ఇంతవరకూ దోషులను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వైసీపీ అధినేత జగన్ మాటలు వక్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. టీడీపీ నేతలు జయరాంరెడ్డి, మదన, శ్రీనివాసులు నాయుడు, అమీర్, శివారెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ అడ్మిషన్లు రద్దు చేయాలి

రైల్వేకోడూరు, ఆగస్టు 10: డిగ్రీలో ఆన్‌లైన్ అడ్మిషన్లు రద్దు చేయాలని, జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజన పథకం పునఃప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాటాలతో సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. గతంలో ఇంటర్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాలు వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు.

SUNDAY FOCUS

లడ్డూ, చక్కెర పొంగలి, ఉప్పుపొంగలి, దద్దోజనం, క్షీరాన్నం.. ఇలా తిరుమల శ్రీనివాసుడికి సమర్పించే నైవేద్యాలు అనగానే పవిత్ర భావంతోపాటూ నోరూరుతుంది. ఘుమఘుమలు ముక్కులను తాకుతాయి. తిరుమల ప్రసాదాల రుచి ఇంకెక్కడా ఎందుకు రాదా అనే సందేహం కలుగుతుంది. అయితే కొన్నేళ్లుగా ప్రసాదాల రూపూ రుచీ మీద పెదవిరుపులు పెరిగాయి. 'అబ్బే.. అప్పుడున్న రుచి.. ఇప్పుడెక్కడిది?' అనే నిట్టూర్పులు వినిపిస్తున్నాయి. జగనన్న పాలనలో తిరుమల ప్రసాదాలు కూడా నాణ్యతలేకుండా పోయాయనే విమర్శలూ హోరెత్తాయి.

ఎందుకు ఇలా? ఏం జరిగింది?

ప్రసాదాలకు ముడి పదార్థాల వాడకంలో, దిట్టంలో మార్పులు జరిగాయి? నాణ్యమైన పదార్థాలు వాడడం లేదా? లడ్డూ నాణ్యతే కాదు, సైజూ తగ్గిపోయిందనీ, అన్నప్రసాదాలు తక్కువ వ్యవధిలోనే పాడైపోతున్నాయనీ భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే వున్నారు.



గతంలోని అన్నప్రసాదాలు





ఆర్గానిక్ ప్రసాదాలు

తిరుమల ప్రసాదాల రుచి ఎందుకు తగ్గింది?

- టీటీడీని కలవరపెడుతున్న భక్తుల అసంతృప్తి
- ఆర్గానిక్ ధాన్యం వాడకంపై పునఃసమీక్ష

శ్రీవారి లడ్డూప్రసాదానికి ఎంతటి ప్రాముఖ్యత ఉందో, ఆలయంలో వితరణ చేసే అన్నప్రసాదాలకూ అంతే ప్రాముఖ్యత ఉంటుంది. ప్రతినిత్యం త్రికార నైవేద్యం పేరుతో శ్రీవారికి రోజుకు మూడు పూటలా నైవేద్య సమర్పించడం ఆనవాయితీ. ఇందులో నైవేద్య సమర్పణ సమయాన్ని మొదటి గంట, రెండో గంట, మూడో గంటగా వ్యవహరిస్తారు. తొలి నివేదన ఉదయం 5.30కు, రెండో నివేదన ఉదయం 10 గంటలకు, రాత్రి నివేదన 7.30 గంటలకు సమర్పిస్తారు. వారపు సేవలను బట్టి నివేదన సమర్పణ సమయం మారుతుంటుంది. స్వామి నివేదించే ప్రసాదాల్లో ప్రధానంగా లడ్డూ, వడ, సీరా, దోశ, ప్రసాదాలతోపాటు చక్కెరపొంగళి, కదంబం, పులిహోర, దద్దోజనం, మిరియాల పొంగలి, సేకరాబాత్, మొలహోరా వంటి అన్నప్రసాదాలూ ఉంటాయి. వీటిని ఆలయంలోని బంగారువాకిలికి ఆగ్నేయదిశగా ఉన్న పోటులో శ్రీవైష్ణవులు పవిత్రంగా ఇప్పటికీ కట్టెల పొయ్యలపైనే తయారు చేస్తున్నారు. ప్రతి ప్రసాదాన్ని ఒక్కో గంగాళంలో తీసుకెళ్లి మూలవర్లకు నివేదించడం గమనార్హం.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కొవిడ్ తర్వాత భక్తులకు దూరమైన ప్రసాదాలు

కొవిడ్ తర్వాత తిరుమలలో స్వామికి సమర్పించే అన్నప్రసాదాల్లో తేడా మొదలైంది. రుచి తగ్గిపోవడంతోపాటూ, తయారు చేసే ప్రసాదాల పరిమాణం తగ్గిపోయింది. ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో అర్థం కాదు. గతంలో స్వామి దర్శనానికి వెళ్లిన ప్రతి ఒక్కరికీ బయటకు రాగానే చక్కెర పొంగలో, పులిహోరో, దద్దోజనమో దొన్నెలో పెట్టి చేతికిచ్చేవారు. ఇప్పుడు వీఐపీలకు తప్ప అన్నప్రసాదాలు అందడం లేదు. ఇందుకు కారణం - అన్నప్రసాదాల తయారీ బాగా తగ్గించేయడమే. గతంలో స్వామికి నివేదించేందుకు ప్రతిరోజు 29 గంగాళాల అన్నప్రసాదాలు తయారు చేసేవారు. శుక్రవారం అభిషేకం సందర్భంగా 40 గంగాళాలు సమర్పిస్తే, గురువారం తిరుప్పావై సేవకు 29 గంగాళాలకు అదనంగా మరో 40 గంగాళాల అన్నప్రసాదాలను స్వామికి సమర్పించేవారు. దర్శనానంతరం భక్తులకు పంచడానికి వీలుగా రోజూ మరో 60గంగాళాల ప్రసాదాలు చేసేవారు. ఇందువల్ల రోజూ 25-30 వేల మంది భక్తులకు అన్నప్రసాదాలు అందేవి.

ఇప్పుడు ఇలా...

కొవిడ్ సమయంలో భక్తులు ఉండరు కాబట్టి అదనపు ప్రసాదాల తయారీని తగ్గించి కేవలం స్వామికి మాత్రమే సమర్పిస్తూ వచ్చారు. ఆతర్వాత భక్తుల సంఖ్య నెమ్మదిగా పెరిగినప్పటికీ దీన్నే కొనసాగించేశారు. వాటి పరిమాణం కూడా దారుణంగా తగ్గించేశారు. పైగా ఆర్గానిక్ పదార్థాలతో తయారు చేసిన అన్నప్రసాదాలనే స్వామికి నివేదించడం మొదలుపెట్టారు. గోఆధారిత వ్యవసాయంతో పండించిన పంటలతోనే గోవిందునికి నైవేద్యం సమర్పించే విధానం 2022 అక్టోబరు నుంచి అమలు అవుతోంది. రోజుకు కేవలం 204 కిలోల దేశీయ బియ్యంతో చేసిన అన్నప్రసాదాలను మాత్రమే స్వామికి ప్రస్తుతం నివేదిస్తున్నారు. దీంతో ఇవి సాధారణ భక్తుల దాకా రావడం లేదు. అధికారులు, వీఐపీలకే సరిపోతున్నాయి.

రుచి తగ్గడానికి కారణాలేమిటి?

బహురూపి, నారాయణకామిని, రత్నచోళి, కాలాబట్, చింతలూరి సన్నం, చిట్టిముత్యాలు, ఎర్రబంగారం వంటి దేశీయ వరిబియ్యంతోనే అన్నప్రసాదాలను వండుతున్నారు. ఈ అన్నప్రసాదాల రుచిపై తీవ్రస్థాయిలో విమర్శలు ఉన్నాయి. మునుపటి అన్నప్రసాదాలతో పోల్చుకుని అందరూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పైగా త్వరగా పాడైపోతున్నాయి కూడా. నిజానికి సేంద్రియ పదార్థాలతో చేసిన వంటల రుచి భిన్నంగా ఉంటుంది. వీటిని వండే పద్ధతి కూడా మారుతుంది. ముడి బియ్యం వాడుతుంటే ఎక్కువ సేపు నానబెట్టడం వంటివి చేయాలి. సేంద్రియ ధాన్యాలతో రకరకాల వంటలు రుచిగా ఎలా చేయవచ్చో అనేక పుస్తకాలు కూడా విడుదలయ్యాయి. ప్రత్యేకంగా రెస్టారెంట్లే నడుస్తున్నాయి. వీటిని ఇష్టపడి మరీ తింటున్నారు. మరి టీటీడీ చేస్తున్న అన్నప్రసాదాలు మాత్రం ఎందుకు రుచిగా లేవన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వీఐపీల నుంచి కూడా విమర్శలు పెరగడంతో టీటీడీ అధికారులు పూర్వపు విధానమే అనుసరించాలా అనే చర్చ కూడా చేస్తున్నారు. సాధారణ సన్న బియ్యంతోనే అన్నప్రసాదాలు తయారు చేయాలా లేక గోఆధారిత ఉత్పత్తులతోనే కొనసాగించాలా అనే అంశంపై కొత్తగా పాలక పగ్గాలు చేపట్టిన అధికారులు పరిశీలిస్తున్నారు. ఇందుకుసంబంధించిన నిపుణుల సూచనలు కూడా కోరుతున్నారు. మునుపటిలా అందరికీ అందేలా అన్నప్రసాదాల తయారీ పరిమాణం కూడా పెంచాలని భక్తులు కోరుతున్నారు.

పుంగనూరులో అత్యధిక వర్షపాతం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 10: జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 19 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా పుంగనూరులో 75.4, అత్యల్పంగా పలమనేరులో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. రొంపిచెర్లలో 51.2, పులిచెర్లలో 47.2, వీకోట 40.4, చౌడేపల్లె 38.6, నగరి 36.2, పెద్ద పంజాణి 20.6, సోమల 14.6, గుడుపల్లె 12.2, నింద్ర 9.4, జీడీ నెల్లూరు 9.2, గుడిపాల 6.8, సదుం, కుప్పం 6.2, బైరెడ్డిపల్లె 5.2, శాంతిపురం 3.6, గంగవరం, తవణంపల్లెలో 3.4మి.మీ వర్షం కురిసింది.

రిజర్వేషన్ల పేరుతో చీలికలకు బీజేపీ కుట్ర

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చింతా మోహన్

కుప్పం, ఆగస్టు 10: రిజర్వేషన్లను అడ్డు పెట్టుకుని కోర్టు తీర్పుల పేరుతో కులం, మతం ప్రాతిపదికగా దేశ ప్రజలను చీల్చడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ అనవసరమన్నారు. క్రీమీలేయర్ ప్రతిపాదన అన్యాయమన్నారు. కుప్పంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పుడు ఎస్సీలు, తర్వాత ఓబీసీలు, ఇతర కులాల్లో రిజర్వేషన్లను తారుమారు చేయడం ద్వారా ప్రజలను చీల్చాలన్న బీజేపీ ప్రయత్నం దేశ సమైక్యతకు విఘాతం కలిగిస్తుందన్నారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలనను పూర్తిగా భ్రష్టు పట్టించారని విమర్శించారు. ఎస్సీ కార్పొరేషన్‌ను మూసివేసి దళిత ద్రోహిగా వ్యవహరించారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవంటూ ఇప్పుడు జగన్ విమర్శించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు ఈవిషయంలో చక్కగా పనిచేస్తున్నారన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌ను తిరిగి ప్రారంభించాలని ముఖ్యమంత్రిని కోరారు. కుప్పం, తిరుపతి అభివృద్ధి గురించి ఆలోచించాలన్నారు. కుప్పంలో ఇప్పటికీ వలసలు ఆగలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రులు వైఎస్సార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, జగన్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం మీద ఎంత ఖర్చు చేశారో ప్రజలకు లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు.

వాహనం ఢీకొని దుప్పి మృతి



గంగవరం, ఆగస్టు 10: పలమనేరు - బెంగళూరు రహదారిలో మామడుగు వద్ద శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి చెందింది. కొన్ని రోజులుగా మామడుగు పరిసర ప్రాంతాల్లోని అటవీ ప్రాంతం నుంచి తరచూ దుప్పులు రోడ్డుపైకి వస్తూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. గత నెలలో ఈ ప్రాంతంలోనే ఒక దుప్పి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. వెంటనే మృతి చెందింది. తాజాగా శనివారం కూడా మామడుగు వద్ద ఇదేతరహాలో మరో దుప్పి చనిపోయింది. డ్రయివర్ వాహనం ఆపకుండా వెళ్లిపోయారు. తీవ్రగాయాలై రోడ్డుపై విలవిలలాడుతున్న దుప్పిని పరిసర ప్రజలు గుర్తించారు. వెంటనే వెళ్లి రోడ్డుపక్కకు తీసుకొచ్చారు. నోటిలో నీరు పోసి రక్షించడానికి ప్రయత్నించారు. అప్పటికే ఆ మూగజీవి మృతిచెందింది. అటవీశాఖ అధికారులకు స్థానికులు ఈవిషయం తెలియజేశారు. దుప్పుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

19 నాటుబాంబుల స్వాధీనం : నిందితుడి అరెస్టు



నాటుబాంబులతో భాస్కర్

గుడిపాల,ఆగస్టు10: మండలంలోని చిత్తపార అటవీ ప్రాంతంలో శనివారం గుడిపాల పోలీసులు 19 నాటుబాంబులు స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన భాస్కర్ అడవి పందులను వేటాడేందుకు తయారు చేసినట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు.

గిరిజన అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ

తిరుపతి(విద్య),ఆగస్టు10:గిరిజన అభ్యర్థులకు ఉచితంగా భోజన వసతితో పాటు డీఎస్సీ శిక్షణను ఉచితంగా అందించనున్నట్టు తిరుపతి జిల్లా గిరిజన సంక్షేమ, సాధికరిత అధికారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన వంద మంది గిరిజన అభ్యర్థులకు ఈ అవకాశం ఉంటుందని వెల్లడించారు. అభ్యర్థులు ఈనెల 16వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు తిరుపతి కలెక్టరేట్‌లోని బీ బ్లాక్, 5వ అంతస్తులోని గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం లేదా సీనియర్ అసిస్టెంట్ పి.శీనయ్య (సెల్ నెంబరు: 94935 24121)ను సంప్రదించవచ్చని సూచించారు.

'పీఎం సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి



చిత్తూరులోని సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్ఈ సురేంద్రన్

చిత్తూరు రూరల్, ఆగస్టు 10: పీఎం సూర్యఘర్ (సోలార్) పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్రనాయుడు సూచించారు. శనివారం చిత్తూరు పర్యటనకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయన్నారు. వీటి ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.78 వేల వరకు సబ్సిడీ ఇస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 1871 మంది దరఖాస్తు చేసుకోగా 1764 నిర్మాణ దశలో, 30 పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ప్రతి ఒక్కరు పీఎం సూర్యఘర్ పథకాన్ని వాడుకొని విద్యుత్ ఆదా చేయాలన్నారు. చిత్తూరులో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం రూ.1.28 కోట్లతో గిరింపేట నుంచి దొడ్డిపల్లి వరకు నూతన లైన్లు వేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో తిరుపతికి దీటుగా చిత్తూరులో విద్యుత్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే 215 సబ్‌స్టేషన్లలో మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదుల పుస్తకాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారులు, రైతులు ఎవరైనా ఈ బుక్ ద్వారా తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చని సూచించారు. ప్రతి బుధవారం నిర్వహించే విద్యుత్ గ్రీవెన్స్ డేకు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి తమిళనాడు సరిహద్దుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నట్లు తెలిపారు. వీటి స్థానంలో కొత్తవి ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ మునిచంద్ర, డీఈ శేషాద్రి, ఏఈలు పాల్గొన్నారు.

టీటీడీ ఇంజనీరింగ్ ఉద్యోగులకు స్టేట్ విజిలెన్స్ నోటీసులు!

తిరుమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా, అవసరానికి మించి నిధులు కేటాయించారంటూ టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే పలువురు అధికారులు, ఉద్యోగులకు స్టేట్ విజిలెన్స్ నోటీసులు జారీ చేసినట్టు తెలుస్తోంది. రాజకీయ లబ్ధికోసం గత వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారం ఇంజనీరింగ్ పనులకు వందల కోట్ల రూపాయలు కేటాయించిందని, అవసరం లేకున్నా రోడ్లు వేశారని, కమీషన్ల కోసం శ్రీవారికి చెందిన కోట్లాది రూపాయలు ఖర్చు చేశారంటూ తీవ్రస్థాయిలో ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈక్రమంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రత్యేకంగా స్టేట్ విజిలెన్స్ బృందాలను తిరుపతికి పంపింది. వారు సుమారు రెండు నెలల పాటు ఇంజనీరింగ్ విభాగం మాత్రమే కాకుండా పలు కీలకమైన విభాగాల్లోనూ సోదాలు చేశారు. ముఖ్యమైన పత్రాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులను విచారించారు. వారి వద్దనుంచి స్టేట్‌మెంట్లు కూడా రికార్డు చేశారు. స్వయంగా అన్నింటినీ పరిశీలించారు. ఈక్రమంలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసిన, చేస్తున్న దాదాపు 58 మంది అధికారులు, ఉద్యోగులకు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ బోర్డు తీర్మానాలను ఎందుకు వ్యతిరేకించలేదంటూ నోటీసుల్లో పేర్కొన్నట్టు తెలిసింది. త్వరలో కొందరిపై చట్టపరమైన చర్యలకు సిఫార్సు చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే మిగిలిన విభాగాల అధికారులు, ఉద్యోగులకూ త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం.

బలి తీసుకున్న బతుకు బండి!

ట్రాక్టరు కింద నిద్రించిన డ్రైవర్

చూసుకోకుండా వాహనాన్ని అతడిపై ఎక్కించేసిన యజమాని

తీవ్రగాయాలతో యువకుడి మృతి



గుణశేఖర్(ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, ఆగస్టు 10: తల్లిదండ్రులు లేకపోయినా ట్రాక్టర్ డ్రైవర్‌గా ఆ యువకుడు జీవనం సాగించేవాడు. బతుకునిచ్చిన బండి కింద అలసటతో ఆదమరచి నిద్రించాడు. దీన్ని యజమాని చూసుకోకుండా ట్రాక్టర్‌ను నడపడంతో బతుకుబండే ఆ యువకుడిని బలి తీసుకున్న విషాద సంఘటన తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం రౌతుసూరమాల వద్ద జరిగింది. బుచ్చినాయుడుకండ్రిగ మండలం భవానీశంకరాపురానికి చెందిన గుణశేఖర్(20)కు బాల్యంలోనే తల్లిదండ్రులు మృతి చెందారు. దాంతో బంధువుల సంరక్షణలో పెరిగాడు. పెద్దవాడయ్యాక తొట్టంబేడు మండలం రౌతుసూరమాల వద్ద గ్రావెల్ ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం వేళ విరామ సమయంలో ట్రాక్టర్ కింద నీడలో సేద తీరేవాడు. శనివారం కూడా తన ట్రాక్టర్ ట్రాలీ కింద నిద్రించాడు. దీన్ని గమనించని ట్రాక్టర్ యజమాని ఆ వాహనాన్ని నడపడంతో దానికింద ఉన్న గుణశేఖర్‌పైకి ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తిరుపతిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. గుణశేఖర్‌కు సమీప బంధువు బత్తెయ్య తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోలీసులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక న్యాయమూర్తి



న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 10: కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేష్‌నాయక్ శనివారం కాణిపాక వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మధుసూదన్‌రావు, లత, శాంతవు పాల్గొన్నారు.

గ్రామాలు బాగుంటే దేశం అభివృద్ధి

మదనపల్లె టౌన్, ఆగస్టు 10: గ్రామాలు అభివృద్ధిలో నడిస్తే దేశం అభివృద్ధి చెందినట్లని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆర్‌జీఎస్‌ఏ శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ కన్న కలలను సాకారం చేయడానికి గ్రామస్వరాజ్యంతో సర్పంచ్‌లు కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తూ, ప్రజారోగ్యం కాపాడటానికి పారిశుధ్యం, వీధి దీపాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పథకాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఈ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెమ్మ, వెలుగు చంద్ర, ఎంపీడీవో భానుప్రసాద్, సీటీఎం సర్పంచ్ ఆనందపార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం తహసీల్దార్‌గా సయ్యద్ అహ్మద్



పెద్దమండ్యం, ఆగస్టు 10: పెద్దమండ్యం నూతన తహసీల్దార్‌గా సయ్యద్ అహ్మద్ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వచ్చిన శ్రీసత్యసాయి జిల్లా తహసీల్దార్ లక్ష్మీనాయక్ స్వంత జిల్లాకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా పెద్దమండ్యం మండల నూతన తహసీల్దార్ మాట్లాడుతూ ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలన్నారు. గ్రామాల్లో ఇసుక, చెరువుల్లో మట్టి తరలింపులు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. రాత్రిలో తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏలు తప్పకుండా విధులకు హాజరు కావాలన్నారు. డీటీలు రవీంద్రనాయక్, గౌరిశంకర్ వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

కలికిరి ఎంపీడీవో బదిలీ

కలికిరి, ఆగస్టు 10: కలికిరి ఎంపీడీవో రామకృష్ణయ్య బదిలీ అయ్యారు. ఎన్నికల నియమావళి మేరకు ఆయన కడప జిల్లా నుంచి కలికిరికి బదిలీ అయ్యారు. ఎన్నికల కారణంగా బదిలీ అయిన ఎంపీడీవోలను యథాతథంగా వచ్చిన మండలాలకే కేటాయించాలని ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో రామకృష్ణయ్య తిరిగి కడప జిల్లాలోని ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతల నుంచి వైదొలిగారు. కాగా ఎన్నికల ముందు ఇక్కడి నుంచి బదిలీ అయిన గంగయ్య తిరిగి ఎంపీడీవోగా రానున్నారు. ఇక ఎమ్మార్వో కార్యాలయానికి చెందిన డిప్యూటీ తహసీల్దారు సయ్యద్ అహ్మద్ పెద్దమండ్యంకు బదిలీ చేస్తూ జిల్లా కలెక్టరు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో కలికిరి డీటీగా కురబలకోటలో పనిచేస్తున్న ఎస్.నవీన్‌ను నియమించారు.

రామసముద్రంలో వర్షం



విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిలిచిన వర్షపునీరు

రామసముద్రం, ఆగస్టు 10: మండలంలో శనివారం వేకువజామున ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులు, కుంటలకు వర్షపునీరు చేరింది. కాగా వర్షంతో రైతులు పండించిన టమోటా, కోసు, కొత్తిమీరి పంటలకు తీవ్ర నష్టం జరిగిందని పలువురు రైతులు వాపోతున్నారు. వర్షంతో మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లోకి వర్షపు నీరు చేరి కుంటను తలపిస్తోంది. పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో కొండామర్రి శివశంకర్‌రెడ్డి ఇంటి ప్రహరీ వర్షానికి కూలిపోయి సుమారు రూ.లక్ష నష్టం జరిగిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

చెరువు అక్రమణల పరిశీలన



అక్రమణ చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఖాజాబీ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 10: మండలంలోని కోళ్లబైలు పంచాయతీ అమ్మచెరువు మిట్టలోని చెరువును కొందరు ఆక్ర మిస్తున్నట్లు శనివారం సమాచారం అందడంతో తహసీల్దార్ ఖాజాబి తమ సిబ్బందిలో వెళ్లి ఆక్రమణను పరిశీంచారు. అక్కడ ఆక్రమణదారులు ఎవ్వరు లేకపోయేసరికి చెరువును సర్వే చేయించి హద్దులు నాటాలని రెవెన్యూ సిబ్బందిని తహసీల్దార్ ఖాజాబీ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా ఎవ్వరైనా ప్రభుత్వ భూములు, చెరువులు, వంకలు, వాగులు ఆక్రమణ చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఆక్రమణలు చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పీలేరు సీఐగా యుగంధర్



పీలేరు, ఆగస్టు 10: పీలేరు అర్బన్ సర్కిల్ నూతన ఇన్‌స్పెక్టరుగా నియమితులైన యుగంధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తుండిన మోహన్ రెడ్డి వీఆర్‌కు బదిలీకాగా కడప జిల్లా బద్వేలులో పనిచేస్తుండిన సీఐ యుగంధర్ పీలేరుకు వచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన కూడళ్లు, వాటిలోని ట్రాఫిక్ సమస్యలను పరిశీలించారు.

చిరుద్యోగులపై వేధింపులా..?

మదనపల్లె అర్బన్, ఆగస్టు 10: చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు తగదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్, అంగన్వాడీ, స్కూల్ స్వీపర్లు, వంట కార్మికులను అకారణంగా తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైభవంగా సీతారాముల శాంతి కల్యాణం

● హనుమద్ వాహనంపై రాముడి నగరోత్సవం

వాల్మీకిపురం, ఆగస్టు 10: వాల్మీకిపురం పట్టాభిరాముడి పట్టాభిషేక మహోత్సవాలలో భాగంగా శనివారం టీటీడీ ఆధ్వర్యంలో సీతారాముల శాంతి కల్యాణం కమనీయంగా, వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో పూజలు చేశారు. భోగోత్సవమూర్తులైన సీతారామలక్ష్మణులకు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ మండపంలో ఊంజల్‌సేవ సాగింది. రాముడి పట్టాభిషేకానికి ముందుగా సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రికి ఆలయంలో మంగళవాయిద్యాలు, వేదపండితుల మత్రోచ్ఛరణలు, విశేష భక్తజనం నడుమ సీతారాముల శాంతి కల్యాణం కమనీయంగా సాగింది. చివరగా విశేష అలంకరణలతో ముస్తాబైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడిని హనుమద్ వాహనంపై పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాలలో టీటీడీ ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, కృష్ణరాజు, అనిల్‌కుమార్, భాషికాచార్యులు, శ్రీరామ్‌కుమార్, రామ్‌గోపాల్, వేదపారాయణ బృందం, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పట్టాభిషేక మహోత్సవాలలో నేడు..

రాముడి పట్టాభిషేక మహోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం స్నపన తిరుమంజనం, రాముడి పట్టాభిషేకం, ఊంజల్‌సేవ, రాత్రికి గరుడవాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి.



వాల్మీకిపురంలో సీతారాముల శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కమనీయం.. పాపేపల్లి లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం

పెద్దమండ్యం, ఆగస్టు 10: పెద్దమండ్యం మండలం పాపేపల్లి కుషావతి నది తీరంలో ఏకశిలగుట్టపై మాండవ్య మహర్షిచే ప్రతిష్ఠించిన లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం కమనీయంగా, వైభవంగా నిర్వహించారు. శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా ఉదయాన్నే ఆలయంలోని స్వామివారికి మేల్కొలిపి ఆలయశుద్ధి, తోమాలసేవ, అర్చన, అభిషేకాలను నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవం పురస్కరించుకొని స్వామి వారితో పాటు శ్రీదేవి, భూదేవి సమేత నరసింహ స్వామి ఉత్సవమూర్తులను ఆకర్షణీయంగా అలకరించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ అర్చకులు విష్ణుమాచార్యులు, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు





మదనపల్లెలో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు, అలంకరణలో వేంకటేశ్వరస్వామి



గుర్రంకొండలో ప్రత్యేక అలంకరణలో నరసింహ స్వామి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 10: శ్రావణమాస తొలి శనివారం పూజలను పట్టణ, మండల ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక దేవళం వీధిలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ఆలయ ఈవో రమణ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారికి ఆలయ అర్చకడు గోవర్ధన్ ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి రావడంతో ఆలయం కిక్కిరిసి పోయింది. కార్యక్రమంలో సాయి చిత్ర భాస్కర్ టీడీపీ కౌన్సిలర్ తులసీ రామకృష్ణ, ఆనంద్, మురళి, ఆలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో: మండలంలోని దిన్నెపల్లె గ్రామ సమీపం మోరుకొండలో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రమైన గెవితిమ్మరాయస్వామి ఆలయంలో శ్రావణమాసం మొదటి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కులశేఖర్‌భట్టార్ స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరణ చేసి భక్తుల దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఛైర్మన్ రఘుపతి, గ్రామ పెద్దల సహకారంతో. స్వామిని దర్శించుకున్న భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలో శ్రావణ మాసం మొదటి శనివారం అంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమండ్యం, పాపేపల్లి, ముసలికుంట, కలిచెర్ల, మందలవారిపల్లి, కోటకాడపల్లి, వెలిగల్లు, కొలిమికాడపల్లి, చెరువుకిందపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుర్రంకొండలో: మండలంలోని సంగసముద్రం గ్రామంలో కొలువైన రామాలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో స్వామి వారికి అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలను చేశారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలను చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు మిట్స్ విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని లోహితారెడ్డి

కురబలకోట, ఆగస్టు 10: మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన లోహితారెడ్డిని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో తృతీయ సంవత్సరం ఏఐ విభాగానికి చెందిన లోహితారెడ్డి ఎన్‌సీసీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు తెలిపారు. కాగా ఎంపికైన విద్యార్థిని ఈ నెల 15న విజయవాడలో జరిగే స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థిని కరస్పాండెంట్ ఎస్.విజయ భాస్కర్ చౌదరి, కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ అభినందించారు.

ఎంబీయూ సైన్స్ పోటీల్లో వీఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభ



ఇస్రో, ఎన్‌ఏఆర్‌ఎల్ అధికారుల నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న వీఎస్ఎన్ సిద్ధార్థ విద్యార్థులు

పీలేరు, ఆగస్టు 10: నేషనల్ సైన్స్ డే-2024 వేడుకలలో భాగంగా ఈ నెల 8, 9 తేదీల్లో తిరుపతి రంగంపేట సమీపంలోని మోహన్ బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో జరిగిన సైన్స్ పోటీల్లో పీలేరులోని వీఎస్ఎన్ సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సైన్స్ డే వేడుకలలో భాగంగా ఇస్రో, ఎన్‌ఏఆర్‌ఎల్, ఎంబీయూ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాలలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైన్స్ ఫెయిర్, క్విజ్ పోటీలు నిర్వహించారు. 60 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఆ పోటీల్లో వీఎస్ఎన్ సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన వీఎస్ఎన్ విద్యార్థులకు ఇస్రో, ఎన్‌ఏఆర్‌ఎల్, ఎంబీయూ అధికారులు, ప్రతినిధులు ప్రశంసాపత్రాలు అందజేశారు. పాఠశాలలో శనివారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆ విద్యాసంస్థల అధినేత్రి మాధవి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

పీలేరు, ఆగస్టు 10: యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) 51వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం పీలేరులోని ఆ సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. కావలిపల్లెలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ నాయకులు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ నేత సదాశివరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతోపాటు ప్రభుత్వ పాఠశాలలు, వాటిల్లోని విద్యార్థుల అభ్యున్నతి కోసం యూటీఎఫ్ అనేక ఉద్యమాలు చేసిందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మహేంద్ర, సుధాకర్, సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, చెంగల్రాయులు, రమణయ్య, అంజిరెడ్డి, శ్రీనివాసులు, మోహన్ రెడ్డి, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థులు తోడ్పాటునివ్వాలి



సమావేశానికి హాజరైన అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 10: మదనపల్లెలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పాటునివ్వాలని ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తొలిసారిగా పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి అనుగుణంగా అన్ని డిగ్రీ కోర్సుల్లో మెరుగైన బోధనలు అందిస్తున్నామన్నారు. విద్యార్థినులకు అనుకూలంగా ఉన్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడంలో పూర్వ విద్యార్థులు సహక రించాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షురాలు తేజోవతి, కౌసర్, నాగశ్రీ, శోభ, రాజేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా శంకరంబాడి జయంతి



వాల్మీకిపురంలో శంకరంబాడి సుందరాచారికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వాల్మీకిపురం, ఆగస్టు 10: మా తెలుగు తల్లికి మల్లెపూదండ గేయ రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతి వేడుకలను శనివారం వాల్మీకిపురంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శంకరంబాడి సుందరాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ శంకరంబాడి సుందరాచారి రచించిన మా తెలుగు తల్లికి మల్లె పూదండ గేయం 1975లో జరిగిన తొలి తెలుగు ప్రపంచ మహా సభలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర గీతంగా గుర్తించడం జరిగిందని, ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, ప్రిన్సిపాల్ కల్పన, వైస్ ప్రిన్సిపాల్ రామలక్ష్మమ్మ, మహిళా ఉపాధ్యాయులు ధనలక్ష్మి, ఫరహత్‌కౌసర్, జ్యోతి, సత్య, శైలజ, గౌతమి, రేఖ, బేబీ, ప్రసన్న, సరస్వతి, వినయ, విద్యార్థులు పాల్గొన్నారు.

కలకడలో చురుకగా పారిశుధ్య పనులు

కలకడ, ఆగస్టు 10:కలకడ గ్రామ పంచాయతీ పారిశుధ్య పనులు చురుకుగా జరుగుతున్నట్లు కార్యదర్శి దేవేంద్ర తెలిపారు. ఇందులో భాగంగా పట్టణంలో మురుగు నీటి కాలువలు పూడిక తీసి శుభ్రం చేసినట్లు తెలిపారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించడంతోపాటు ప్యాగింగ్ చేయించారు. అలాగే ప్రజలకు దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

రాష్ట్రం గర్వించేలా మదనపల్లెలో తిరంగా ఉత్సవాలు



స్వాతంత్ర్య దినోత్సవాల నిర్వహణపై చర్చిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఆగస్టు 10: స్వాతంత్ర ఉద్యమరాలు అనిబిసెంట్ నిర్వహించిన హోమ్‌రూల్ ఉద్యమానికి పుట్టినిల్లు అయిన మదనపల్లెలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రాష్ట్రం గర్వించే స్థాయిలో నిర్వహిద్దామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, పట్టణ ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షాజహాన్‌బాషా ఈనెల 12, 13, 14 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల గురించి వివరించారు. 12న పట్టణంలో పెద్దసంఖ్యలో విద్యార్థుల ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 13న విద్యాసంస్థల్లో స్వాతంత్ర్య సమర వీరుల గురించి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. 14న సాయంత్రం 6గంటల నుంచి స్థానిక మిషన్ కాంపౌండులో పద్మశ్రీ శోభరాజ్ బృందంచే కీర్తనలు, అనంతరం అన్ని విద్యాసంస్థల నుంచి దేశభక్తి ఉట్టిపడేలా సాంస్కృతి కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు తనవంతుగా రూ.5లక్షలు ఇస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. నియోజకవర్గంలోని అధికారులు, ప్రజలు ఈ మూడు కార్యక్రమాలకు హాజరై విజయవంతంచేయాలని కోరారు. వాటి నిర్వహణకు ప్రతి విభాగానికి ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కొండయ్యనాయుడు, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, విద్యాసంస్థల అధినేతలు ఆర్.గురుప్రసాద్, ఎన్. సేతు, లక్ష్మినారాయణ, శ్రీనివాసులు, రఘునాథరెడ్డి, కృష్ణారెడ్డి, పోర్డు లలితమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపైన జాతీయ జెండాను ఆవిష్కరించాలి

రామసముద్రం, ఆగస్టు 10: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలు వారి వారి ఇంటిపై హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని మండల బీజేపీ నేతలు పిలుపునిచ్చారు. మండలంలో శనివారం బీజేపీ మండల స్థాయి కార్యవర్గం సమావేశంలో వారు మాట్లాడుతూ 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్‌ఘర్ తిరంగా అభియాన్‌ను విజయవంతం చేయాలని స్వాతంత్ర్య సమరయోధులకు పుష్పాంజలి ఘటించాలని, బైక్‌ర్యాలీ నిర్వహించాలని తీర్మానించారు. అలాగే మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులుగా రామసముద్రం ఎగువ హరిజనవాడ కృష్ణప్పను నియమిస్తూ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బి.నరసింహులు నియమించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు ఇంజం ఆనంద్‌కుమార్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి శేఖర్, యువమోర్చా నేత సుబ్రహ్మణ్యం నాయుడు, వెంకటేశ్, శివారెడ్డి, బాలాజి, మంజునాథ్, ఎమ్మార్పీఎస్ గంగాధర్, కొండప్ప, గంగాధర్, కిసాన్ మోర్చా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ పథకం తాగునీటిలో క్లోరిన్ పరీక్షలు



పెద్దతిప్పసముద్రం ఆగస్టు 10 : కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జలజీవన్ పథకం తాగునీటిలో క్లోరినేషన్‌పై శనివారం పరీక్షలు నిర్వహించారు. మంచి నీటిలో కలుషితమైన సూక్ష్మజీవులను, క్లోరిన్‌ను గుర్తించేందుకు జలజీవన్ పథకం ద్వారా పీఎచ్ ఏఫైర్ ల్యాబ్ టెక్నీషియన్ వినయ్ వెస్ట్ గోదావరి నుంచి వచ్చి మండలంలోని మల్లెల గ్రామంలో పరిశీలన చేశారు. మల్లెల గ్రామంలో రెండు వాటర్ ట్యాంకులకు రెండు మంచినీటి బోర్ల ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందుతోంది. ఇందులో భాగంగా కుళాయిల ద్వారా నీరు ఏసమయానికి నీరు వదులుతారు అన్న సమాచారాన్ని ల్యాబ్ టెక్నీషియన్ ప్రత్యక్షంగా ప్రజలను అడిగి తెలుసుకుని మొత్తం 12 శాంపిల్‌లను పరీక్షించారు. వాటిని ల్యాబ్‌కు పంపించి నీటిలో ఉన్న క్లోరిన్ శాతం ఏవిధంగా ఉంది నీటిలో ఏమైనా సూక్ష్మజీవులు కలిగి ఉన్నాయా అనే కోణంలో తెలుసుకుని వాటి ఆధారంగా తగిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. స్థానిక సర్పంచ్ శ్రీకంఠరెడ్డి పంచాయతీ కార్యదర్శి ప్రమీల, బోరు మెకానిక్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

పోలీస్ సబ్‌డివిజన్‌లో 13 మంది ఎస్‌ఐల బదిలీలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 10: మదనపల్లె పోలీసు సబ్‌డివిజన్‌లోని 13 పోలీసేస్టేషన్‌లలో పనిచేస్తున్న ఎస్‌ఐలను బదిలీ చేస్తూ కర్నూల్ రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లె వన్ టౌన్ ఎస్ఐ-1గా కడప డీఎస్‌బీలో పనిచేస్తున్న అన్సర్‌బాషాను, ఎస్ఐ-2గా వాల్మీకిపురం నుంచి బి.శ్రీనివాసులునాయక్‌ను బదిలీ చేశారు. అలాగే మదనపల్లె టు టౌన్ ఎస్ఐ-1గా కేవీపల్లె నుంచి ఎస్‌కె రహీముల్లా, ఎస్ఐ-2గా పి.కృష్ణమూర్తిని బదిలీ చేశారు. మదనపల్లె తాలూకా ఎస్ఐ-1గా హరిహరప్రసాద్, ఎస్ఐ-2గా పి.వి.రమణను బదిలీ చేశారు. ముదివేడు ఎస్‌ఐగా పీలేరు నుంచి దిలీప్‌కుమార్‌ను, నిమ్మనపల్లె ఎస్‌ఐగా బైరెడ్డిపల్లె నుంచి బి.కృష్ణయ్యను, రామసముద్రం ఎస్‌ఐగా మదనపల్లె తాలూకా నుంచి రవికుమార్‌ను, ములకలచెరువు ఎస్‌ఐగా రాయచోటి దిశా నుంచి గాయత్రిని, తంబళ్లపల్లె ఎస్‌ఐగా నిమ్మనపల్లె నుంచి లోకేశ్‌రెడ్డి, పెద్దమండ్యం ఎస్‌ఐగా సోమల నుంచి కె.శివశంకరను, పీటీఎం ఎస్‌ఐగా పీలేరు నుంచి ఎంకె నరసింహులును బదిలీ చేశారు.

నిరుద్యోగ యువతకు కంప్యూటర్ ట్యాలీలో శిక్షణ

నిమ్మనపల్లి, ఆగస్టు 10: మండలంలోని నిరుద్యోగ యువతకు కంప్యూటర్ ట్యాలీలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్ఫేర్ అసిస్టెంట్ రమణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కర్నూలు ఎడ్యుకేషన్ ఉన్నతి ఫౌండేషన్ నిర్వాహకులు మంజునాథ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్ ట్యాలీపై 35రోజుల పాటు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ లు చేసిన 19ఏళ్ల నుంచి 25 ఏళ్ల వయస్సు కలిగిన అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం 15వేలకు పైబడి వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8790873345 నెంబరును సంప్రదించాలని కోరారు.

అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కృష్ణప్ప

ములకలచెరువు, ఆగస్టు 10: అన్నమయ్య జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో అన్యాక్రాంతమైన భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు తోపు కృష్ణప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం మండల కార్యదర్శి అంజనప్ప అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ బాధితుల సమస్యలపై ఈ నెల 12వతేదీన భూ బాధితుల సమ స్యలపై జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. అన్యాక్రాంతమైన భూములను ప్రస్తుత ప్రభుత్వం స్వాధీనం చేసుకుని చిన్న కారు, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు పంపిణీ చేయాలన్నారు. రాజ్యాంగ ప్రకారం ప్రతి కుటుంబానికి 25 ఎకరాలకు మించి ఉండకూడదని చట్టం చెబుతుంటే మరో వైపు రాజకీయ నాయకులు వేలాది ఎకరాలు ఎలా సంపాదిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. సమావేశంలో నాయకులు చంద్ర, ఎల్లప్ప, ఉత్తన్న, వెంకటరమణ, శివప్ప, సుధాకర పాల్గొన్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులకు లెజండరీ పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు

పీలేరు, ఆగస్టు 10: హైదరాబాదులోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురికి లెజండరీ పురస్కారాలు ప్రదానం చేసింది. కళలు, జర్నలిజం, విద్య, సామాజిక సేవ వంటి రంగాల్లో సేవలందిస్తున్న పలువురిని ఎంపిక చేసి శనివారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో పురస్కా రాలు అందజేసింది. పీలేరుకు చెందిన అంతర్జాతీయ బహుభాషా నాటక రంగ కళాకారుడు, జర్నలిస్టు ఖాదర్ బాషాకు ఎన్టీఆర్ లెజండరీ పురస్కారం, గౌస్‌బాషా, కవి, రచయిత మురళీధర్‌రాజు, ఏఎస్ఐ ప్రసాద్ రాజులకు అల్లూరి సీతారా మరాజు లెజండరీ పురస్కారం, మాస్ కమ్యూనికేషన్స్ నిపు ణుడు డాక్టర్ యోగేష్ బాబు, ఆంగ్ల బోధకురాలు కె.విజితలకు కోడి రామకృష్ణ లెజండరీ పురస్కారం అందజేశారు. యాదమర్రి పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీ నారాయణ, తిరుపతికి చెందిన చిత్రకారిణి బత్తుల అర్చనలకు మదర్ థెరీసా లెజండరీ పురస్కారం, పీలేరు మండలం రేగళ్లుకు చెందిన షామీర్ బాషాకు గాంధీ లెజండరీ పురస్కారాలను అందజేశారు.

మునిగోపాలకృష్ణకు జాతీయ నంది అవార్డు

మదనపల్లె అర్బన్, ఆగస్టు10:మదనపల్లెకు చెందిన మునిగోపాలకృష్ణకు జాతీయ నంది అవార్డు వరించింది. శనివారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులోని రవీంద్రభారతి ఆడిటోరియంలో జాతీయ స్థాయి అవార్డులను అభిలాష హెల్పింగ్‌హ్యాండ్స్ అధ్యక్షురాలు అందించారు. ఇందులో ఏపీకి సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ మునిగోపాలకృష్ణ చేసిన సేవలను గుర్తించి జాతీయ స్థాయి ఎన్టీఆర్ లెజండరి అవార్డును, నంది అవార్డును అందించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణా ఎమ్మెల్యే హరి ప్రారంభించారు. సినీనిర్మాత, డైరెక్టర్ సత్యవెంకట ప్రసాద్, డాక్టర్ సరోజనమ్మ, సినీ హీరోయిన్ ఫరీదా జాన్, హీరో నరేంద్రలు అవార్డును అందించారు. కార్యక్రమంలో గొల్లపూడి తిరుపతిరావు, ప్రొఫెసర్ శ్రీనివాసులు, మునిరత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.